ప్రజా చైతన్యమే...

# లక్ష్యం

తెలుగు దినపత్రిక

R.N.I. No. APTEL/2013/48712

email : lakshyam2013@gmail.com

ఎడిటర్ ఇన్ చీఫ్ - మధుసూదనరావు చల్లా

ఎడిటర్ ఇన్ చీఫ్ - మధుసూదనరావు చల్లా
Cell : 6302222748, 9492569010

Simultaneously circulated in Amaravathi, Hyderabad, Vijayawada, Nellore, Ongole, Guntur, Krishna, Chittoor, Kadapa & all Districts of Andhra Pradesh & Telangana.

సంపుటి : 12 సంచిక : 118 గుంటూరు బుధవారం 4 జూన్ 2025 పేజీలు : 8 వెల : 5.00

LEGAL AFFAIRS
All legal Affairs About Lakshyam Telugu Daily, Should be filled in Guntur Courts Only

## పంజాబ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు పాఠాలు

పంజాబ్ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు పాఠాలను చెబుతున్నారు. ఆశ్చర్యంగా ఉందా.. కానీ ఇది అక్షరాలా నిజం. కేంద్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు దేశంలోని అన్ని సర్కారీ బడుల్లో భారతీయ భాషా వేసవి శిబిరాలను నిర్వహించారు. ఇందులో భాగంగానే పంజాబ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆ క్యాంపుల్లో హాజరైన విద్యార్థులకు టీచర్లు తెలుగు నేర్పిస్తున్నారు. విద్యార్థులకు తెలుగు ఓనమాలు నేర్పించి, పాఠాలు బోధించారు. కేంద్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు పంజాబ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో మే 26వ తేదీ నుంచి వారం రోజుల పాటు సమ్మర్ క్యాంప్స్ జరిగాయి. ఈ శిబిరాలకు 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు హాజరయ్యారు. వారికి యూట్యూబ్‌లో చూసి తెలుగు వర్ణమాల నేర్పించారు. తెలుగులో కూరగాయల పేర్లు, పండ్లు, వంటకాలు ఇలా చాలా వాడుకపదాలను విద్యార్థులు నేర్చుకున్నారు.

## ఇండిగో విమానాన్ని ఢీకొట్టిన పక్షి

రాంచీ : ఇండిగో విమానానికి సోమవారం ప్రమాదం తప్పింది. దాదాపు 175 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఇండిగో ఎయిర్‌బస్ 320 విమానాన్ని రాబందు ఢీ కొట్టింది. దీంతో ఆ విమానాన్ని రాంచీలోని బిర్సా ముండా విమానాశ్రయంలో అత్యవసరంగా దింపాల్సి వచ్చిందని ఓ అధికారి తెలిపారు.

విమానం రాంచీకి దాదాపు 10 నుంచి 12 నాటికల్ మైళ్ల దూరంలో 3-4వేల అడుగుల ఎత్తులో ఉండగా పక్షి ఢీకొన్నదని, దీంతో పైలెట్ విమానాన్ని అత్యవసరంగా ల్యాండింగ్ చేయాల్సి వచ్చిందని విమానాశ్రయ డైరెక్టర్ ఆర్ఆర్ మౌర్య పేర్కొన్నారు. పట్నా నుంచి రాంచీకి విమానం వస్తుండగా మధ్యాహ్నం 1.14 గంటలకు ఈ ఘటన జరిగింది.



## సీఎం చంద్రబాబుతో అక్కినేని నాగార్జున భేటీ.. విషయం ఏంటంటే?

అమరావతి : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిశారు సినీ హీరో అక్కినేని నాగార్జున.. ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు క్యాంప్ కార్యాలయానికి వెళ్లిన నాగార్జున.. ఆయనతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు.. తన చిన్నకుమారుడు అక్కినేని అఖిల్ వివాహ ఆహ్వానపత్రికను సీఎం చంద్రబాబుకు అందజేసిన నాగార్జున.. తన కుమారుడి పెళ్లి రావాలంటూ ఆహ్వానించారు.. కాగా, గతేడాది అక్కినేని నాగార్జున పెద్ద కుమారుడు నాగచైతన్య - శోభితా వివాహ బంధంలోకి అడుగుపెట్టగా.. ఇప్పుడు ఆయన చిన్న కుమారుడు అఖిల్ కూడా పెళ్లి చేసేందుకు సిద్ధమయ్యారు.. ఇప్పటికే ప్రముఖ బిజినెస్‌మెన్ జుల్ఫీ రవ్డ్జీ కుమార్తె జైనబ్‌తో గతేడాది నవంబర్ 26వ తేదీన అక్కినేని అఖిల్ నిశ్చితార్థం చేశారు.. ఇక, ఈ నెల 6వ తేదీన అక్కినేని అఖిల్ - జైనబ్ వివాహం నిర్వహించబోతున్నారు.. జైనబ్ హైదరాబాద్‌కు చెందిన అమ్మాయి.. కొన్ని ఏళ్లుగా అఖిల్‌తో ప్రేమలో ఉన్నారు.. ఇప్పటికే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు ప్రముఖులను కలిసి అక్కినేని నాగార్జున ఆహ్వానించిన విషయం విదితమే.. ఇక, హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో అఖిల్ - జైనబ్ వివాహం జరగనున్నట్టుగా తెలుస్తుండగా.. ఆ తర్వాత రాజస్థాన్‌లో గ్రాండ్‌గా రిసెప్షన్ ప్లాన్ చేశారని సమాచారం..





ఖమ్మం: రైతులకు ఎంతో ఉపయోగపడేలా 'భూభారతి' చట్టాన్ని జాగ్రత్తగా రూపకల్పన చేశామని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు.

ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమాడులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సహచర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ అత్యంత పారదర్శకంగా భూభారతి చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. కొత్త చట్టాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మనుషులకు ఆధార్ లాగే భూములకు త్వరలో భూధార్‌ను తీసుకొస్తామని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భూభారతి చట్టం తెచ్చామన్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించి భూములను సర్వే చేయిస్తామని తెలిపారు. గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి 3,500 మంది రెవెన్యూ అధికారులను నియమిస్తున్నామని పొంగులేటి చెప్పారు. మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే విప్లవాత్మక చట్టాన్ని తమ ప్రభుత్వం తెచ్చిందన్నారు. దశాబ్దాలుగా ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా.. భూముల సమస్యలు పరిష్కారం కాలేదని చెప్పారు. భూభారతితో రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు.

## బనకచర్ల ప్రాజెక్టును ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పుకోం: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్: ఏపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టును తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సముద్రంలో కలిసే నీళ్లే వాడుకుంటామని ఏపీ నేతలు ఎలా చెబుతారని ప్రశ్నించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ "బనకచర్లను అడ్డుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు, కేంద్ర మంత్రి సి.ఆర్. పాటిల్‌కు లేఖలు రాశాం. ఈ అంశంపై కేంద్ర మంత్రితో నేరుగా మాట్లాడాం. ప్రాజెక్టును అడ్డుకోవాలని కోరాం. మా అభ్యంతరాలను కేంద్రానికి తెలియజేశాం. ఈ అంశంపై సరైన సమయంలో స్పందిస్తాం" అని ఉత్తమ్ తెలిపారు.



## రేషన్ కార్డుదారులకు పండుగలాంటి వార్త! ఇక క్యూఆర్ కోడ్ స్కానింగ్‌తో అన్నీ సులువే!

అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఒక గొప్ప శుభవార్తను అందించింది. జూన్ 1వ తేదీ నుంచి రాష్ట్రంలో రేషన్ పంపిణీ విధానంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయి. గతంలో వైసీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేసేది.

కానీ, ఇకపై ఆ విధానానికి స్వస్తి పలికి, తిరిగి రేషన్ దుకాణాల ద్వారానే పంపిణీ చేయాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. దీనివల్ల ప్రజలకు మరింత సౌకర్యంగా ఉంటుందని భావిస్తున్నారు. జూన్ 1 నుంచి ఈ కొత్త విధానం అమల్లోకి వచ్చింది. వృద్ధులు, దివ్యాంగులు రేషన్ కోసం ఇబ్బంది పడకూడదని, వారికి ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీనివల్ల వారు ఎండలో క్యూలో నిలబడే అవసరం ఉండదు. అంతేకాదు, రేషన్ పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ప్రభుత్వం చాలా జాగ్రత్తలు తీసుకుంటోంది. ప్రతి రేషన్ షాపులో ఒక క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీని ద్వారా మీరు ఏమైనా ఫిర్యాదులు చేయాలనుకుంటే, వెంటనే స్కాన్ చేసి మీ సమస్యను ప్రభుత్వానికి తెలియజేయవచ్చు. దీనివల్ల పారదర్శకత పెరుగుతుంది, ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వెంటనే చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ కొత్త విధానం వల్ల పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. రేషన్ సరుకులు సక్రమంగా అందుతాయి, ఎటువంటి మోసాలు జరగవు. కాబట్టి, రేషన్ కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం కోరుతోంది.




హైదరాబాద్: మిస్ వరల్డ్ పోటీలకు చాలా దేశాలతో పోటీ పడి హైదరాబాద్ అవకాశం దక్కించుకుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ పోటీలతో తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలు, హస్తకళల గొప్పతనం ప్రపంచానికి తెలిసిందని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో జూపల్లి మాట్లాడారు. భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన ఆరోపణలపై మంత్రి స్పందించారు. "భారాస చేసిన ప్రతి ఆరోపణపై బహిరంగ చర్చకు నేను సిద్ధం. మిస్ వరల్డ్ పోటీల ఖర్చుపై హరీశ్‌రావు తప్పుడు ఆరోపణలు చేశారు. రూ.31కోట్ల ఖర్చులో 21 కోట్లు స్పాన్సర్ల ద్వారానే వచ్చింది. మరో 12 కోట్ల ఆదాయంపై ఒప్పందాలు ఉన్నాయి. రూ.200 కోట్లు ఖర్చు చేసినట్లు హరీశ్‌రావు ఆరోపిస్తున్నారు. ఆ ఆరోపణలను ఆయన నిరూపిస్తారా? అని సవాల్ విసురుతున్నా. మిస్ వరల్డ్ కంటెస్టెంట్లకు 30 తులాల బంగారం ఇచ్చారనేది అబద్ధం. 30 తులాలు కాదు.. 3 గ్రాములు కూడా ఇవ్వలేదు" అని జూపల్లి అన్నారు.

## గజమాల దెబ్బను రాయిదాడిగా చిత్రీకరించారు.. కేసు క్లోజ్ చేయాలి: ఏబీ వెంకటేశ్వరరావు



విజయవాడ: మనుషుల జీవితాల్ని, శవాలను తొక్కుకుంటూ రాజకీయాలు చేసే వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని రిటైర్డ్ డీజీ ఏబీ వెంకటేశ్వరరావు విమర్శించారు. గజమాల వేసినప్పుడు తగిలిన దెబ్బను అప్పటికప్పుడు రాయి దాడిగా చిత్రీకరించి రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని మండిపడ్డారు. రాయి దాడి కేసులో బలహీనుడైన సతీశ్‌ను బలి చేశారని, 45 రోజులు జైలులో పెట్టారని అన్నారు. జగన్‌పై దాడి కేసును ఎదుర్కొంటున్న బాధితుడు సతీశ్, అతని కుటుంబాన్ని ఏబీ వెంకటేశ్వరరావు పరామర్శించారు. "ఒక వడ్డెర కులస్తుడి జీవితాన్ని, అతడి కుటుంబాన్ని నాశనం చేశారు. ప్రభుత్వం మారిన తర్వాత కూడా తప్పుడు కేసును కొట్టివేయకుండా నేటికీ తిప్పుతున్నారు. ఇవాళ్టికీ కేసులో ఎలాంటి పురోగతి లేదు. బాధితులకు రూ.2లక్షలు ఇస్తామని మభ్యపెట్టారు. వాళ్లపై ఏ రకమైన థర్డ్ డిగ్రీ ప్రయోగించారో వింటే గుండె తరుక్కుపోతోంది. నేటికి చేత్తో అన్నం తినలేని పరిస్థితిలో ఉన్నారు. ఇంత దుర్మార్గం చేసిన పోలీసులపై ఎందుకు చర్యలు తీసుకోలేదు? సమాజానికి ఏ రకమైన సందేశం ఇస్తున్నారు? బాధితులు చేసిన తప్పేంటి? ఏ మాత్రం సంబంధం లేని, సాక్ష్యం కూడా లేని కేసులో ఎందుకు బాధపడాలి? ఈ కేసులో బాధితులను బలి చేసిన బాధ్యులపై ప్రభుత్వం, డీజీపీ, సీపీ చర్యలు తీసుకోవాలి. కేసును తక్షణమే మూసివేయాలి. బెయిల్ బాండ్స్ రద్దు చేసి.. కట్టిన డబ్బులు తిరిగి ఇవ్వాలి. ప్రభుత్వం బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలి"అని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు.

## అధికారం లేకపోతే రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొనరా?: ఆది శ్రీనివాస్




హైదరాబాద్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా పెద్ద పండగలా నిర్వహించినట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. జూన్ 2న భారాస మాత్రమే ఈ వేడుకలను నిర్వహించలేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం గుర్తుంటుందా? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. "జూన్ 2న కేసీఆర్ బయటికి రాలేదు. కనీసం అమరవీరులకు నివాళులర్పించలేదు. కేటీఆర్ అమెరికాకు వెళ్లారు.. ఆయనా రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొనలేదు. అధికారం లేకపోతే ఈ వేడుకల్లో పాల్గొనరా? అధికారం ఇవ్వకుంటే ప్రజల్లోకి వచ్చేది లేదని భారాస నేతలు ఒక సంకేతం ఇచ్చారు. రాష్ట్రంలో 25.35 లక్షల మంది రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రుణ మాఫీ చేసింది. గతంలో భారాస ప్రభుత్వం రుణమాఫీని సక్రమంగా ఎప్పుడూ పూర్తి చేయలేదు" అని ఆది శ్రీనివాస్ విమర్శించారు.

## జగన్‌ను చూసి జాలిపడటం తప్ప ఇంకేం చేయలేం: రఘురామ ఎద్దేవా

అమరావతి: నేరగాళ్లకు మాజీ సీఎం జగన్ పరామర్శ.. దిగజారుడు ఓట్ల రాజకీయానికి పరాకాష్ఠ అని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "రాజకీయాల్లో ఆత్మహత్యలే తప్ప హత్యలుండవు అనే సామెత జగన్‌లాంటి వారిని చూసే వచ్చింది. గంజాయి బ్యాచ్‌ను పరామర్శించి రాజకీయంగా ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులపై హత్యాయత్నం చేసిన నిందితులకు జగన్ అండదండలా? నాడు ఎంపీగా ఉన్నప్పుడు అప్పటి అధికారి సునీల్‌కుమార్‌తో నన్ను కస్టడీలో కొట్టించింది జగనే. ఆయన్ను చూసి జాలిపడటం తప్ప ఇంకేమీ చేయలేం" అని రఘురామ ఎద్దేవా చేశారు.



## కేటీఆర్, హరీష్‌రావులకు మంత్రి పొన్నం సవాల్..

తెలంగాణ ఖ్యాతి ఖండాంతరాలు దాటుతుంటే చూసి ఓర్వలేకపోతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి నెల నుంచే విపక్షాలు పిల్లి శాపనార్థాలు పెడుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్‌మండిపడ్డారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. అంతర్జాతీయ అతిథులు రాష్ట్రానికి వస్తే విమర్శలు చేయడం తగదని అన్నారు. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్‌రావులకు సవాల్ చేస్తున్నా.. దీనిపై చర్చకు ఎక్కడకు రావాలి.. తెలంగాణ భవన్‌కు రావాలా? అబిడ్స్ చౌరస్తాకు రావాలో చెప్పాలన్నారు. రూ. 200 కోట్లు ఖర్చు ఎక్కడ అయ్యాయో చెప్పాలని.. ఖర్చు అయినట్లు నిరూపించాలని.. లేదంటే ముక్కు నెలకు రాయాలని మంత్రి సవాల్ చేశారు.

**వారం రోజులు టైమ్ ఇస్తున్నా...** కేటీఆర్, హరీష్‌రావు చెప్పిన టైమ్‌కు చర్చకు ఎక్కడికైనా వస్తానని దీనికి వారం రోజులు సమయం ఇస్తున్నానని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ధైర్యం ఉంటే బహిరంగ చర్చకు వారు రావాలని మరోసారి ఆయన సవాల్ చేశారు.






అమరావతి : సినిమా మేకింగ్‌కు ఓ కష్టం. రిలీజ్ చేయాలంటే ఎన్నో అవస్థలు. తీరా విడుదల తర్వాత బాక్సాఫీస్ దగ్గర సీన్ సితార అవుతుంది. ప్రొడ్యూసర్ నష్టపోతున్నారు. డిస్ట్రిబ్యూటర్స్ రోడ్డుక్కుతున్నారు. ఇలా టాలీవుడ్ ఇండస్ట్రీలో చాలా సమస్యలు ఉన్నాయ్. అన్నీ సాల్వ్ చేసుకోవాలని ఫిక్స్ అయిపోయారట స్టార్ హీరోలు. పెద్ద హీరోలు సంవత్సరానికి ఒక్క సినిమా కూడా చేయకపోవడం, షూటింగ్‌లలో జాప్యం, భారీ రెమ్యూనరేషన్ డిమాండ్‌లు వంటి అంశాలు నిర్మాతలకు, డిస్ట్రిబ్యూటర్లకు తలనొప్పిగా మారాయట. ఈ నేపథ్యంలో టాలీవుడ్ స్టార్ హీరోలందరూ ఒకే వేదిక మీదకు రాబోతున్నారట. టాలీవుడ్ స్టార్ హీరోలు మీటింగ్‌కు, ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నాయకత్వం వహిస్తారట. స్టార్ హీరోలంతా ఏడాదికి కనీసం రెండు సినిమాలు చేయాలని, ఒక్కొక్కరూ తమ ప్రాజెక్ట్‌లను స్పీడప్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట. అంతేకాదు భారీ రెమ్యూనరేషన్‌లకు బదులు ప్రాఫిట్ షేరింగ్ పద్ధతిలో పనిచేయాలని, దీంతో ప్రొడ్యూసర్లకు ఆర్థిక భారం తగ్గడమే కాక, సినిమాల నాణ్యతపైనా హీరోలు బాధ్యత తీసుకునే అవకాశం ఉంటుందని ఆలోచిస్తున్నారట. స్టార్ హీరోలు ఒకే వేదికపైకి వస్తే చాలా ప్రాబ్లమ్స్ పరిష్కారం అవుతాయని అనుకుంటున్నారట. హీరోలు, ప్రొడ్యూసర్ల ప్రాబ్లమ్స్ సాల్వ్ అయితే టాలీవుడ్‌లో కొత్త ఉత్సాహం వస్తుందని, మరిన్ని లోబడ్జెట్ మూవీస్‌కు అవకాశాలు పెరుగుతాయని అంటున్నారు. ఈ విషయంపై చర్చించేందుకు త్వరలోనే టాలీవుడ్ స్టార్ హీరోలంతా ఒక కీలక సమావేశానికి హాజరకాబోతున్నారని వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ మీటింగ్‌ను పవన్ కల్యాణ్ లీడ్ చేస్తారని అంటున్నారు. సినిమా ఇండస్ట్రీ పట్ల ఆయన చూపిస్తున్న చొరవ, ఆలోచనలు ఈ సమావేశానికి ఊపు తెస్తాయని టాక్. ఇందులో చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్, బాలకృష్ణ వంటి సీనియర్ స్టార్స్‌తో పాటు, యంగ్ హీరోలు కూడా పాల్గొనే అవకాశం ఉందని అంటున్నారు. ఈ ప్లాన్ వర్కౌట్ అయితే టాలీవుడ్‌లో కొత్త ఒరవడి సృష్టించే అవకాశం ఉంది. మరి ఈ మీటింగ్ ఎప్పుడు, ఎక్కడ జరుగుతుంది.? హీరోలంతా ఈ ప్రతిపాదనలను ఒప్పుకుంటారా? అనేది చూడాలి.




'థగ్ లైఫ్' విడుదలను నిషేధించాలని కోరుతూ కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (కేఎఫ్‌సీసీ) కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. నేడు దీన్ని విచారించిన హైకోర్టు కమల్ హాసన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎంత పెద్ద నటుడైనప్పటికీ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఆయనకు లేదని హెచ్చరించింది. ఈ అంశంపై తీవ్రంగా స్పందించింది. అతడి వ్యాఖ్యలకు ఆధారాలను అడిగింది. 'ఒక్క క్షమాపణ చెబితే అన్నీ పరిష్కారమయ్యేవని' వ్యాఖ్యానించింది. "మీరు కమల్‌హాసన్ కావచ్చు లేదా మరెవరైనా కావచ్చు. ప్రజల మనోభావాలను దెబ్బతీయలేరు. ఒక ప్రజాప్రతినిధిగా అలాంటి ప్రకటన చేయకూడదు. మీ కామెంట్స్ వల్ల అశాంతి ఏర్పడింది. కన్నడ ప్రజలు మిమ్మల్ని క్షమాపణలు మాత్రమే అడిగారు. మీరు ఏ ప్రాతిపదికన ఆ ప్రకటన చేశారు? మీరు ఏమైనా చరిత్రకారులా? లేక భాషావేత్తనా? ఎందుకు అలాంటి వ్యాఖ్యలు చేశారు?" అని కమల్‌హాసన్‌ను హైకోర్టు ప్రశ్నించింది. "క్షమాపణ చెప్పని పక్షంలో కర్ణాటకలో సినిమాను ఎందుకు ప్రదర్శించాలనుకుంటున్నారు? వదిలేసేయండి. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ హద్దులు దాటి, ప్రజల మనోభావాలను దెబ్బతీయకూడదు కదా. మీరు క్షమాపణ చెబితే ఏ సమస్యా ఉండదు. మీ సినిమాను ప్రదర్శించటం ద్వారా కర్ణాటక నుంచి కూడా మీరు రూ.కోట్లలో ఆదాయాన్ని పొందవచ్చు" అని కోర్టు పేర్కొంది. కమల్‌హాసన్ ఉద్దేశ పూర్వకంగా ఆ వ్యాఖ్యలు చేయలేదని ఆయన తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకురాగా, 'పరిస్థితుల కారణంగా బాధితుడయ్యే వ్యక్తికీ, వాటిని సృష్టించే వ్యక్తికీ మధ్య చాలా తేడా ఉంది. ఇప్పటికే కమల్‌హాసన్ బాహాటంగా తన అభిప్రాయాన్ని ప్రకటించారు. దాన్ని మీరు ఇప్పుడు కప్పిపుచ్చలేరు. మిగిలింది క్షమాపణలు చెప్పడమే' అని కోర్టు వ్యాఖ్యానించగా, కమల్‌హాసన్ పరిస్థితిని చక్కబరిచేందుకే ప్రయత్నించినా, అది పక్కదారి పట్టిందని ఆయన తరఫు న్యాయవాది అన్నారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ 'కావచ్చు. కానీ, కారణం ఎవరు? మీరే పరిస్థితి చేయిదాటిపోయేలా చేశారు. ఇప్పుడు మీ సినిమాను రక్షించాలని కోరుతున్నారు' అని కోర్టు వ్యాఖ్యానించింది. ఇటీవల జరిగిన 'థగ్ లైఫ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో తమిళం నుంచి కన్నడ పుట్టిందంటూ కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి కారణమయ్యాయి. దీంతో ఆయన వ్యాఖ్యలపై అధికార, విపక్ష పార్టీలతో పాటు కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కూడా తీవ్రంగా స్పందించాయి. ఈ క్రమంలోనే 'థగ్‌లైఫ్'ని కర్ణాటకలో నిషేధించాలని కోరుతూ కేఫ్‌సీసీ హైకోర్టును ఆశ్రయించింది.




## మచిలీపట్నంలో 2కె రన్.. మంత్రితో కలిసి ప్రారంభించిన మంచు మనోజ్, నారా రోహిత్

మచిలీపట్నం : మచిలీపట్నంలో 'భైరవం'టీమ్ సందడి చేసింది. నటులు మంచు మనోజ్, నారా రోహిత్, దర్శకుడు విజయ్ కనకమేడల పట్టణానికి వచ్చారు. బీచ్ ఫెస్టివల్ సందర్భంగా మంగళవారం ఉదయం నిర్వహించిన 2కె రన్‌ను మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరితో కలిసి వారు ప్రారంభించారు. పట్టణంలోని కోనేరు సెంటర్ నుంచి లక్ష్మీ టాకీస్ వరకు రన్ కొనసాగింది. సినీ నటులను చూసేందుకు స్థానికులు ఎగబడ్డారు. ఈ సందర్భంగా మంచు మనోజ్ మాట్లాడుతూ మచిలీపట్నం రావడం ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ పోర్టు నిర్మిస్తున్న సీఎం చంద్రబాబుకు సెల్యూట్ అని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి పర్యాటకశాఖ కీలకమని నారా రోహిత్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## తెనాలిలో జగన్ పర్యటన.. దళిత, ప్రజా సంఘాల నిరసన

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలిలో మాజీ సీఎం జగన్ పర్యటనపై దళిత, ప్రజా సంఘాలు నిరసన తెలిపాయి. ఐతా నగర్‌లో రౌడీషీటర్లను పరామర్శించడానికి రావడంపై అభ్యంతరం వ్యక్తం చేశాయి. జగన్ కాన్వాయ్ వస్తుండగా నల్లబెలూన్లతో దళిత సంఘాలు నిరసన కార్యక్రమం చేపట్టాయి. జగన్‌కు వ్యతిరేకంగా ఆయా సంఘాల నేతలు నినాదాలు చేశారు. అనంతరం మార్కెట్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. తెనాలిలో గంజాయి విక్రయాలు, సామాన్యులపై దాడులు, మహిళలపై వేధింపులు, హింసాత్మక ఘటనలకు పాల్పడిన ముఠా సభ్యులను పరామర్శించేందుకు జగన్ రావడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.






భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అమెరికా పర్యటన కొనసాగుతోంది. దీనిలో భాగంగా డాలస్‌లో అమెరికాలోనే అతి పెద్దదైన మహాత్మాగాంధీ విగ్రహాన్ని సందర్శించారు. అక్కడ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ అహింస, సత్యాగ్రహమే ఆయుధాలుగా భారతీయులందరినీ గాంధీ సమాయత్తం చేశారన్నారు. బ్రిటిష్ బానిస సంకెళ్ల నుంచి దేశాన్ని విడిపించి స్వాతంత్ర్యం తీసుకొచ్చేందుకు కృషి చేశారని కొనియాడారు. అందుకే ప్రపంచవ్యాప్తంగా నేటికీ గాంధీని ప్రశంసిస్తూనే ఉంటారని చెప్పారు. అలాంటి విశ్వనాయకుడి విగ్రహాన్ని ఇంత పెద్ద ఎత్తున డాలస్ (ఇర్వింగ్)లో నెలకొల్పడంలో మహాత్మాగాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సాస్ వ్యవస్థాపక అధ్యక్షులు డా.ప్రసాద్ తోటకూర, కార్యవర్గ సభ్యుల కృషిని కేటీఆర్ అభినందించారు. అనంతరం ఆ సంఘం వ్యవస్థాపక కార్యదర్శి రావు కల్వాల మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు, దశాబ్దకాలం పాటు రాష్ట్ర అభివృద్ధికి మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, వారి కుటుంబసభ్యులు చేసిన కృషి, త్యాగాలను రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మరువలేరని చెప్పారు. గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం కేసీఆర్ మార్గనిర్దేశంలో కేటీఆర్ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. కేసీఆర్ విజన్ తెలంగాణకు ఒక గళాన్ని ఇచ్చిందన్నారు. డా.ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ అమెరికాలో అతి పెద్దదైన గాంధీ స్మారకస్థలిని నిర్మించి 10 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ఈ నిర్మాణం ప్రవాస భారతీయుల సమష్టి కృషి, ఐకమత్యానికి నిదర్శనమని చెప్పారు. దీన్ని సాకారం చేసేందుకు అనుమతులు ఇచ్చిన నగర అధికారులు, దాతలు, కార్యవర్గ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా డాలస్ సందర్శనకు వచ్చినవారు ఈ గాంధీ స్మారకస్థలిని సందర్శిస్తూనే ఉన్నారని చెప్పారు. అనంతరం కేటీఆర్‌ను బోర్డు సభ్యులు రావు కల్వాల, బీఎన్ రావు, తైయాబ్ కుండావాలా, మురళి వెన్నం, రాజేంద్ర వంకావాలా, అనంత్ మల్లవరపు, వినోద్ ఉప్పు, షబ్నం మాడ్గిల్‌తో కలిసి డా.ప్రసాద్ తోటకూర ఘనంగా సన్మానించారు. వందలాది ప్రవాస భారతీయులు హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో కోపెల్ సిటీ కౌన్సిల్ మెంబర్ రమేశ్ ప్రేమ్ కుమార్, ఎన్ఆర్ఐ భారాస అమెరికా విభాగం అధ్యక్షుడు తన్నీరు మహేశ్, ఎన్ఆర్ఐ భారాస గ్లోబల్ కన్వీనర్ బిగాల మహేశ్, నేతలు ఎల్.రమణ, తాతా మధు, గ్యాదరి బాలమల్లు, నవీన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి, కర్నె ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, బాల్క సుమన్, గువ్వల బాలరాజు, గండ్ర వెంకటరమణారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, గాదరి కిశోర్, క్రాంతి కిరణ్, పైలట్ రోహిత్‌రెడ్డి, కోరుకంటి చందర్, నోముల భగత్, బానోతు చంద్రావతి, గండ్ర జ్యోతి, దామోదర్, జాన్సన్ నాయక్, అమరేందర్‌రెడ్డి, రఘువీర్‌సింగ్, యుగంధర్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, అభిలాష్ రంగినేని, సోమ ఉపేందర్‌రెడ్డి, వంశీరెడ్డి, అరవింద్‌రావు తక్కెళ్లపల్లి తదితరులు పాల్గొన్నారు.




అమరావతి: వెన్నుపోటు దినమంటూ జగన్ కొత్త నాటకానికి తెరలేపారని మంత్రి అనగాని సత్యప్రసాద్ మండిపడ్డారు. ఐదేళ్లు ప్రజలకు చేసిన మోసానికి జగన్ ప్రాయశ్చిత్తం చేసుకోవాలని సూచించారు. "జూన్ 4న వైకాపా నేతలు పశ్చాత్తాప దినంగా నిర్వహించుకోవాలి. కూటమి ప్రభుత్వ పాలన చూసి ఆ పార్టీ నేతలు ఓర్వలేకపోతున్నారు. అలవాటు ప్రకారం అసత్యాల ప్రచారమే పనిగా పెట్టుకున్నారు.

తల్లి, చెల్లిని వెన్నుపోటు పొడిచిన జగన్‌ను ప్రజలు నమ్మట్లేదు. ఇదే వైఖరి కొనసాగితే వైకాపా పరిస్థితి గుండుసున్నానే" అని అనగాని విమర్శించారు. దళితులను జగన్ దగా చేసిన చరిత్రను ప్రజలు ఎవరూ మర్చిపోలేరని మంత్రి డీబీవీ స్వామి అన్నారు. కుట్రపూరిత రాజకీయాలను ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదన్నారు.

## టీ.బీజేపీలో రాజాసింగ్ కల్లోలం



హైదరాబాద్, జూన్ 3: తెలంగాణ బీజేపీలో ఎమ్మెల్యే రాజాసింగ్ ఎపిసోడ్ కల్లోలం రేపుతోంది. తరుచుగా టీ.బీజేపీ నాయకత్వంపై ఆయన విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. నోటీసులు కాదు దమ్ముంటే సస్పెండ్ చేయాలంటూ ఎమ్మెల్యే సవాల్ విసిరారు. హిజ్రాలు అంటూ రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ బీజేపీ నాయకత్వం సీరియస్‌గా ఉంది. ఎమ్మెల్యే వ్యవహారంపై ఢిల్లీ పెద్దలతో టీ.బీజేపీ నాయకత్వం చర్చించనుంది. రాజాసింగ్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంది. హైకామండ్‌తో చర్చించి ఎమ్మెల్యేపై చర్యలకు స్టేట్ పార్టీ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. రోజు రోజుకు రాజాసింగ్ ఎపిసోడ్ చిలికిచిలికి గాలివానగా మారుతోంది. ఈరోజు సాయంత్రం జాతీయ నాయకత్వంతో రాష్ట్ర నాయకత్వం మాట్లాడి ఆయనను సస్పెండ్ చేసే దిశగా చర్యలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. బీజేపీలో పనిచేస్తున్న సీనియర్ నేతలపై ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. వాళ్లతో పనిచేయడానికి బదులు తనను సస్పెండ్ చేయాలంటూ రాజాసింగ్ సవాల్ విసిరారు. ఆ సవాల్‌ను అటు హైకమాండ్.. ఇటు స్టేట్ బీజేపీ చాలా సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. ముందు నుంచి కూడా బీజేపీలో రెబల్ క్యాండిడేట్‌గా రాజాసింగ్ ఉన్నారు. గత కొద్దిరోజులుగా బీజేపీ రాష్ట్ర నాయకత్వంతో రాజాసింగ్‌కు పొసగని పరిస్థితి. కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ మధ్యవర్తిత్వం వహించి పార్టీ రాష్ట్ర నాయకత్వానికి, రాజాసింగ్‌కు మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేశారు. అయితే హైదరాబాద్ లోకల్ బాడీ ఎన్నికలు ముగిసే వరకు బాగానే ఉన్నట్లు కనిపించినప్పటికీ కొద్దిరోజులుగా రాజాసింగ్ స్వరం పెంచారు. ముఖ్యంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చిట్‌చాట్ అనంతరం జరిగిన పరిణామాల తర్వాత తెలంగాణ బీజేపీపై రాజాసింగ్ పలు వ్యాఖ్యలు చేస్తూ రెబల్‌గా మారే ప్రయత్నం చేశారు. పార్టీ లైన్ క్రాస్ చేసి ఎవరైనా మాట్లాడినా, పార్టీకి కట్టుబడి ఉండకపోతే వారిపై చర్యలు తప్పవని ఇటీవల హైకమాండ్, స్టేట్ పార్టీ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో దమ్ముంటే సస్పెండ్ చేయాల్సిందిగా సవాల్ విసురుతూ ఎమ్మెల్యే ప్రెస్‌నోట్ విడుదల చేశారు. ఈ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకున్న హైకమాండ్.. ఏ క్షణమైనా రాజాసింగ్‌కు షోకాజ్ నోటీసులు ఇవ్వడం లేదా, పార్టీ నుంచి సస్పెండ్ చేసే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.

హైదరాబాద్ : హైడ్రా ప్రజావాణికి సోమవారం 23 ఫిర్యాదులు రాగా, ఇందులో 70 శాతం వరకు నాలాల సమస్యలపైనే వచ్చాయి. కంప్లయింట్స్?ను అడిషనల్ కమిషనర్ పాపయ్య స్వీకరించారు. సికింద్రాబాద్, తిరుమలగిరి, భూదేవినగర్‌లోని సాయిదత్తా గార్డెన్స్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఉద్దేశించిన 225 గజాల స్థలం కబ్జా అయ్యిందని స్థానికులు ఫిర్యాదు చేశారు. 2004లోనే బల్దియాకు ఆ స్థలాన్ని ఇచ్చి కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరినా.. ఫలితం లేదన్నారు. శేరిలింగంపల్లి మండలంలోని ఖానామెట్ విలేజ్‌లో 11/20, 11/21 సర్వే నంబర్లలో 1983లో గురుకుల ట్రస్ట్?లేఅవుట్ వేశారు. అందులోని ప్లాట్లతో పాటు రోడ్లు కబ్జాకు గురయ్యాయని స్థానికులు ఫిర్యాదు చేశారు.

**నాలాల కబ్జాలపై..** బేగంపేటలోని చికోటి గార్డెన్స్ ప్రాంతంలో నాలా కుంచించుకుపోవడంతో బృందావన్ అపార్టుమెంట్‌లోకి వరద వచ్చి చేరుతోందని, 2020లో వరదలకు సెల్లార్ నీట మునిగిందని, ఇలా వర్షాకాలం వచ్చిందంటే ఇబ్బందులు పడుతున్నామని అపార్టుమెంటు వాసులు ఫిర్యాదు చేశారు. అలాగే, కూకట్‌పల్లి లోని రంగధాముని చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమణలతో పాటు ఈ చెరువు నుంచి ఐడీఎల్ చెరువుకు వెళ్లే నాలా కూడా కబ్జాకు గురైందని స్థానికులు కంప్లయింట్ చేశారు. భారీ వర్షాలు పడితే ఏడు కాలనీలకు వరద ముప్పు పొంచి ఉంటోందని వాపోయారు. ఆక్రమణలు తొలగించి వరద సాఫీగా వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. హస్మత్‌పేట నాలా–, పికెట్ నాలాలు కుంచించుకుపోవడంతో బేగంపేట పరిసరాల్లో పాయిగా కాలనీ, విమాన్ నగర్, బీహెచ్ ఈఎల్ కాలనీ, అవంతి కాలనీ, రసూల్‌పురా బస్తీ వరదలో చిక్కుకుంటున్నాయని ఫిర్యాదు వచ్చింది. సైదాబాద్, బాలాజీనగర్‌లో మురుగు, వరద కాలువలు కబ్జాకు గురయ్యాయని బాలాజీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రా దృష్టికి తెచ్చారు.

ఓవైసీ దవాఖాన వద్ద చెరువు నిండితే వరద ఆదర్శనగర్ మీదుగా సరూర్‌నగర్ చెరువుకు చేరాల్సి ఉండగా.. వరద కాలువ కుంచించుకుపోవడంతో బస్తీలు నీట మునుగుతున్నాయని పేర్కొన్నారు.



## మలేరియాపై అవగాహన ర్యాలీ

మాచర్ల లక్ష్యం ప్రతినిధి :మలేరియా మాసోత్సవాలు సందర్భంగా మలేరియా వ్యాధి, దాని కారణాలు, లక్షణాలు, వ్యాప్తి మరియు నివారణ గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు మంగళవారం డాక్టర్ ద్రాక్షయని ఆధ్వర్యంలో పట్టణంలోని యూపీహెచ్ సి కోర్ట్ బజార్ ప్రాంతంలో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ద్రాక్షయని మాట్లాడుతూ మలేరియా ఒక ప్రమాదకరమైన వ్యాధి అని ఆడ అనాఫిలిస్ దోమల కాటు ద్వారా మలేరియా వ్యాపిస్తుందన్నారు. మలేరియా సోకినట్లయితే, అధిక జ్వరం,




వణుకు, చలి, తలనొప్పి, వాంతులు, విరేచనాలు మొదలైన లక్షణాలు కనిపిస్తాయన్నారు. సరైన సమయంలో వైద్యం తీసుకోకపోతే ప్రాణాంతకంగా మారుతుందని తెలిపారు. మలేరియా నివారణకు దోమ కాటుకు దూరంగా వుండాలని, దోమతెరలను వాడాలని, ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ప్రతి ఫ్రైడే ను డ్రై డేగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా అధికారి లక్ష్మయ్య, శ్రీనివాసరావు, సూపెర్వైజర్ నాగేశ్వరావు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## రేపు ప్లాస్టిక్ కాలుష్యంపై అవగాహన ర్యాలీ

మాచర్ల లక్ష్యం ప్రతినిధి :జూన్ 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ కాలుష్యంను అంతం చేసేందుకు అందులో ప్రజలను భాగం చేసేందుకు ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు జరగనున్నాయని అందులో భాగంగా గురువారం పట్టణంలో ప్లాస్టిక్ కాలుష్యంపై అవగాహన ర్యాలీ చేపట్టినట్లు యూటిఎఫ్ నాయకురాలు అయోషాసుల్తానా మంగళవారం తెలిపారు. ప్లాస్టిక్ కాలుష్యం వలన భూమి, నీరు, వాయువును కలుషితం



అవుతుందని, ఇది పర్యావరణానికి ఎంతో హానికరమని, మన ఆహారం, నీరు, గాలి ద్వారా మన శరీరంలోకి చేరి, ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని చెప్పారు. జంతువులు, మొక్కల జీవితాలను పై తీవ్ర ప్రభావితం చూపుతుందని పేర్కొన్నారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రజలు కలిసి పనిచేయాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, పునరుపయోగం రీసైకిలింగ్ తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ చేపట్టినట్లు చెప్పారు. ప్రజలంతా ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయోషా సుల్తానా కోరారు.

## ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

మాచర్ల లక్ష్యం ప్రతినిధి :మాచర్ల పట్టణంలోని శ్రీ సత్యసాయి విద్యా విహార్ నందు మంగళవారం సత్యసాయి స్కూల్స్ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు జరిగాయి. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు సుజాత, గీతలు ఉపాధ్యాయులకు సలహాలు సూచనలను అందజేశారు. నేటితరం విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. మానవతా విలువలు లేని విద్య ఎడారిలో ఒయాసిస్ వంటిదని సత్య



సాయిబాబా వారు అన్నారని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత గురువులపై ఉందన్నారు. కార్యక్రమంలో సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ అక్కినేని అనిల్, సత్య సాయి సేవా సమితి కన్వీనర్ జక్కా శ్రీనివాసరావు, పాఠశాల ప్రిన్సిపల్ వై రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ మధురవాణి పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

### నేడు పట్టణంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

మాచర్ల లక్ష్యం ప్రతినిధి :33/11కెవి రైట్ కెనాల్ సబ్ స్టేషన్ నుంచి వస్తున్నటువంటి 11కెవి బాలజీ ఫీడర్ నందు రెక్టిఫికేషన్ పనులు నిమిత్తము బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పట్టణ విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వినాయకుని గుట్ట, అజాద్ నగర్, జయంతి నగర్, మున్సిపాలిటి పంప్ హౌజ్ ఏరియాలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, కావున ఈవిషయాన్ని గమనించి విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించవలసిందిగా కోరారు.

# ఏడాది పాలనలో అభివృద్ధి వైపు పయనిస్తున్న మాచర్ల

**వేల కోట్ల నిధులతో నియోజకవర్గంలో అభివృద్ధి**
**-మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి**





మాచర్ల లక్ష్యం ప్రతినిధి :కూటమి ప్రభుత్వం 365 రోజుల పాలనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రజా క్షేమం, సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీఠ వేస్తున్నారని మాచర్ల నియోజకవర్గం శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ 365 రోజుల పాలనలో నియోజకవర్గ పరిధిలో అభివృద్ధిని ప్రజలు చూశారని చెప్పారు. నియోజకవర్గ చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఏడాది పాలనలో వేల కోట్ల నిధులు కేటాయించి మాచర్ల నియోజకవర్గాన్ని ఆధునీకరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

**రూ. 178 కోట్లతో ప్రధాన రహదారులు ఆధునీకరణ**

గత ఐదేళ్ల పాలనలో మాచర్ల నియోజకవర్గం ఎటువంటి అభివృద్ధిని నోచుకోలేదని ఎమ్మెల్యే జూలకంటి అన్నారు. ఎక్కడ చూసినా ప్రధాన రహదారులు గుంటల మయంగా మారి, ప్రజా రవాణా దుర్భరంగా తయారైందని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెనువెంటనే దాదాపు రూ.175 కోట్ల నిధులతో నియోజకవర్గంలో ప్రధాన, ప్రధాన రహదారులను కలిపే అంతర్గత రోడ్లను అభివృద్ధి చేశామని ఆయన పేర్కొన్నారు. అంతేకాక గ్రామీణాభివృద్ధికి పెద్ద పేట వేస్తూ రూ. 16 కోట్లతో సీసీ రోడ్లను నిర్మించామని ఆయన వివరించారు.

**జలజీవత్‌తో తాగు నీటి కష్టాలు తీరతాయి**

జల జీవన మిషన్ ద్వారా నియోజకవర్గంలో మారుమూల తండాలకు సైతం శుద్ధ జలాలను అందించే లక్ష్యంతో రూ. 600 కోట్లు, మాచర్ల పట్టణ తాగునీటి అవసరాలకై అమృత స్కీం ద్వారా రూ.117 కోట్లు నిధులను కూటమి ప్రభుత్వం కేటాయించిందని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఇంటికి కుళాయి ద్వారా శుద్ధ జలాలను అందించే ఆశయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఆయన చెప్పారు.

**విద్యకు మౌలిక సదుపాయాలు కల్పన**

నియోజకవర్గంలో విద్యాలయాల్లో మౌలిక వసతులు పెంపొందించి, నూతన భవనాల నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను కేటాయించిందని ఎమ్మెల్యే జూలకంటి ఉద్ఘాటించారు. నియోజకవర్గ పరిధిలోని రూరల్ మండలం తాళ్లపల్లి నందు రూ. 25 కోట్ల తో నూతనంగా కేంద్రీయ విద్యాలయం నిర్మాణం, కారంపూడి, దుర్గి, వెల్దుర్తి మండలాల్లో కస్తూర్బా గాంధీ గిరిజన బాలికల పాఠశాల, మోడల్ స్కూల్స్ నందు నూతనంగా అదనపు భవనాలు, వసతి గృహాలకు రూ. 8 కోట్ల నిధులను కేటాయించడం జరిగిందని ఆయన వివరించారు.

**వ్యవసాయం, పాడి పరిశ్రమకు సముచితస్థానం**

నియోజకవర్గంలో వ్యవసాయం, పాడి పరిశ్రమకు సముచిత స్థానం కల్పిస్తున్నామని ఎమ్మెల్యే జూలకంటి వెల్లడించారు. ఎన్ఎస్పీ కాలువ పూడిక తీత పనులకు రూ. 4 కోట్ల 50 లక్షలు, నియోజకవర్గ పరిధిలో దాదాపు రూ. 3 కోట్లతో 125 మినీ గోకులాలకు ఖర్చు చేయగా, రూ. 18 లక్షలు విలువచేసే వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులకు అందజేసినట్లు ఆయన చెప్పారు.

**ప్రజా సంక్షేమానికి రూ. 235 కోట్లు ఖర్చు**

ఈ ఏడాది పాలనలో మాచర్ల నియోజకవర్గంలో 41 వేల 749 మంది అర్హులకు రూ. 235 కోట్ల, 32 లక్షల, 82 వేలు పంపిణీ చేసి ఆదుకుందని ఎమ్మెల్యే జూలకంటి వివరించారు. అలానే సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ. 5 కోట్లను ఆపదలో ఉన్న వారికి వైద్య ఖర్చులు నిమిత్తం అందజేసినట్లు ఆయన వెల్లడించారు. అర్హులైన అన్నీ వర్గాలకు వారికి ఆర్థిక ఊతాన్ని ఇచ్చేందుకు వ్యక్తి గత రుణాలు, మహిళా సాధికారితకు కుట్టు మిషన్ల పంపిణీ వంటి కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఆయన వివరించారు.

**పర్యటకాభివృద్ధికి ఊతం**

పర్యటకంగా వెనకబడ్డ నాగార్జున సాగర్ కు జవసత్వాలను తీసుకొచ్చేందుకు నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయల ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే జూలకంటి వివరించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.25 కోట్లు మంజూరయ్యేలా ఆయన చొరవ చూపారన్నారు. బౌద్ధ వారసత్వం, సాంస్కృతిక చిహ్నాలను సుసంపన్నం చేస్తూ పర్యాటకంగా ఆదాయం పెంచడాన్ని కూటమి ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేస్తోందని చెప్పారు. వెనకబడ్డ ఎగువ పల్నాడు పర్యాటకంగా ప్రగతిని సాధిస్తే, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆయన పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పెద్ద ఎత్తున నిధులను తీసుకొచ్చి మాచర్ల నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధికి ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కట్టుబడి పని చేయడం నియోజకవర్గ ప్రజలు అదృష్టంగా భావిస్తున్నానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి హర్షం వ్యక్తం చేశారు.

# అన్నదాత సుఖీభవ 20. వేల రూపాయలు ప్రతి కౌలు రైతులకు ఇవ్వాలి..

**కాకుమాను తహసీల్దార్ కార్యాలయం లో వినతిపత్రం అందజేత.. ఏపీ సంఘం డిమాండ్**



పెదనందిపాడు జూన్ 3. (లక్ష్యం న్యూస్)అన్నదాత సుఖీభవ 20 వేల రూపాయలు ప్రతి కౌలు రైతుకు ఇవ్వాలని కోరుతూ మంగళ వారం కాకుమాను తాహిశీల్దార్ కార్యాలయం లో ఆర్.ఐ. ప్రియదర్శని కి ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కౌలు రైతు సంఘం సహాయ కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ రాష్ట్రం లో నూటికి 70 శాతం మంది కౌలు రైతులు పొలాలుసాగు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం భూయజమాని సంతకం ఉంటేనే కౌలు రైతు కార్డు ఇవ్వాలనే నిబంధన విధించడం తో అతి కొద్దిమందికి మాత్రమే కౌలు రైతులకు కార్డు లు అందాయని అన్నారు.దాంతో ప్రభుత్వ పథకాలు, బ్యాంకు లో పంట రుణాలు అందక కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు.ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న నేటి ప్రభుత్వ నాయకులు కూడా పాత చట్టాన్నే అమలు చేస్తుందన్నారు.కేంద్రం లో ఉన్న బి.జె.పి. ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించనని ఖరాఖండిగా చెప్పిందన్నారు. దీంతో కేంద్రం ఇచ్చే ఆరు వేల రూపాయలు కూడా కౌలు రైతులకు అందడం లేదన్నారు.నేటి ప్రభుత్వం కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ ఇస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని అన్నారు.ఓసి కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ ఇవ్వాలని కోరారు.భూయజమాని సంతకం తొలగించి గ్రామ సభల ద్వారా కౌలు రైతులను గుర్తించి కార్డు లు ఇవ్వాలన్నారు.వాస్తవ సాగుదారుల పేరుతోనే ఈ క్రాప్ నమోదు చేయాలని కోరారు. ప్రతి పంటను ఈ క్రాప్ చేయాలన్నారు.కౌలు రైతులు, సాగుదార్లకు పంట రుణాలు రీ షెడ్యూల్ చేసి కొత్తగా పంట రుణాలు ఇవ్వాలని కోరారు.

ఈ కార్యక్రమం లో నాయకులు నల్లమోతు రాజేంద్ర, దొప్పలపూడి రమేష్ బాబు, జంపని రామారావు తదితరులు పాల్గొన్నారు.

# నూతన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను ప్రారంభించిన నరసరావుపేట శాసనసభ సభ్యులు చదలవాడ

నరసరావుపేట జూన్ 3 (లక్ష్యం న్యూస్):: నరసరావుపేట పట్టణంలో విద్యుత్ వినియోగదారులకు లోవోల్టేజ్ సమస్య తీర్చటంలో భాగంగా స్థానిక ఏనుగుల బజార్లో మరియు బాపనయ్య నగర్ లో ఏర్పాటు చేసినటువంటి నూతన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను నరసరావుపేట శాసనసభ సభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు నరసరావుపేట తెలుగుదేశం పార్టీ నాయకులు కపిలవాయి విజయ్ కుమార్ ప్రారంభించారు ఈ సందర్భంగా శాసనసభ సభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించే కూటమి ప్రభుత్వం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రోత్సాహంతో ఈ రోజు నరసరావుపేట నియోజకవర్గంలో నూతన ట్రాన్స్ఫార్మర్లు మంజూరు చేసుకోవడం జరిగిందని వాటిలో భాగంగా ఈ రోజున ఏనుగుల బజార్ మరియు బాపనయ్య నగర్ లో ట్రాన్స్ఫార్మర్లు ప్రారంభించడం జరిగిందన్నారు ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిహెచ్ రాంబట్లు మాట్లాడుతూ సుదీర్ఘకాలం నుండి వినియోగదారులు ఈ ప్రాంతంలో సమస్య ఉందని పేర్కొన్న తరుణంలో స్థానిక శాసనసభ సభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల దినోత్సవం లో వచ్చిన అర్జీల ఆధారంగా ఈ యొక్క విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ లు ఒక్కొక్కటి సుమారు పది లక్షల రూపాయల వ్యయంతో మంజూరు చేసుకుని ప్రారంభించడం జరిగింది అదేవిధంగా నియోజకవర్గంలో విద్యుత్ శాఖ



సంబంధించిన అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని రాబోయే రోజుల్లో నిరంతర విద్యుత్ కొరకు అన్ని ప్రాణాళికలు తయారు చేస్తున్నామని ముఖ్యంగా ప్రధానమంత్రి సూర్య గర్ యోజన కింద రాయితీతో కూడిన సోలార్ ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు ఈ యొక్క కార్యక్రమంలో నరసరావుపేట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్లు రఫీ, సురేంద్రబాబు, విద్యుత్ శాఖ సిబ్బంది ఆర్ బంగారయ్య, లైన్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాసరావు , తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు విద్యుత్ వాడకందారులు తదితరులు పాల్గొన్నారు.

## గడ్డపోతారం మున్సిపల్ లో భూ భారత్ చట్టం రెవిన్యూ సదస్సు

జిన్నారం జూన్ 03 ( లక్ష్యం ప్రతినిధి )తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి బాట లో భాగంగా భూభారతి చట్టం ప్రకారం ఈరోజు గడ్డపోతారం మున్సిపాలిటీలో రెవిన్యూ సదస్సును ముఖ్య అతిథులు జిన్నారం మండల్ ఎం ఆర్ ఓ దేవిదాస్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది, కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ పులిగిల్ల ప్రకాష్ చారి గడ్డపోతారం సంఘం అధ్యక్షులు నారబోయిన కుమార్ బిజెపి



జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మణ్ రావు జిన్నారం మండల్ నూతనంగా బాధ్యతలు తీసుకున్నటువంటి తాసిల్దార్ దేవిదాస్ కి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది, కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎంఆర్ సోషల్ మీడియా రాష్ట్ర నాయకులు నార బోయిన శ్రీనివాస్ ముదిరాజ్, ఎంపీ బాలయ్య ఎన్ నాగరాజు బి శ్రీనివాస్ పి బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉంటా ఎమ్మెల్యే కేపీ వివేకానంద

**ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, అభివృద్దే తారక మంత్రంగా అందరికీ అందుబాటులో ఉంటా, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

కుత్బుల్లాపూర్ జూన్ 03 ( లక్ష్యం ప్రతినిధి )ప్రతీ రోజు నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, ప్రజల సమస్యలను సావధానంగా వింటూ సమస్యల పరిష్కార దిశగా అధికారులను ఆదేశించడంతో పాటు



ఆత్మీయ నేతకు మా ఇంటి ఆహ్వానం అంటూ ప్రజలు అందజేసే ఆహ్వానాలను అందుకుంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు, మహిళా నాయకురాలు పలు వినతులు, ఆహ్వానపత్రికలు అందజేయగా సానుకూలంగా స్పందించారు.

## కాకుమాను మండల గ్రామాల్లో పొగాకు మండల్ పరిశీలిస్తున్నరైతు సంఘం

పెదనందిపాడు జూన్ 3 (లక్ష్యం న్యూస్ )జూన్ 5 న గుంటూరు లోని జి.పి.ఐ.కార్యాలయం వద్ద జరిగే పొగాకు రైతుల ధర్నా ని జయప్రదం చేయమని కాకుమాను మండలం లోని పలు గ్రామాలలో రైతు సంఘం నాయకులు కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు.పొగాకు కంపెనీల యాజమాన్యాలను నిలదీసేందుకు జూన్ 5 న గుంటూరు లోని జి.పి.ఐ.కార్యాలయం ముందు జరిగే ధర్నాలో రైతులు పాల్గొనాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామారావు కోరారు.మంగళవారం కాకుమాను మండలం లోని పెద్దివారిపాలెం,కొమ్మూరు గ్రామాలలో రైతు సంఘం నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు, జంపని రామారావు, నల్లమోతు రాజేంద్ర, కన్నెగంటి చందర్రావు లతో కలసి రామారావు ప్రచారం నిర్వహించారు. నల్ల బర్లీ పొగాకు వేయమని రైతులను ప్రోత్సహించిన జి.పి.ఐ.కంపెనీతో పాటు ఇతర కంపెనీలు



మొహం చాటేశాయని , ఇది చాలా అన్యాయమని అన్నారు.మే 24 న ఆరుగురుమంత్రుల కమిటీ చర్చలలో మొదటి రకం 12 వేలు ,రెండవ రకం 5 వేలు తగ్గకుండా కొంటామని.ఒప్పుకునినేడు మాటమారుస్తున్నారన్నారు.ఇప్పటికే ముగ్గురు రైతులు ఆత్మహత్య లకు పాల్పడగా ఇద్దరు రైతులు చనిపోయారని అన్నారు.అప్పుల వాళ్ళు నిలదీస్తున్నారని వారికి సమాధానం చెప్పలేక రైతుల విలవిలలాడుతున్నారన్నారు. ఈ పరిస్థితులలో కంపెనీల యాజమాన్యాలను నిలదీసేందుకు జూన్5 వ తేదీ న గుంటూరు రింగ్ రోడ్డు లో విద్యానగర్ 3 వ లైన్ లో ఉన్న జి.పి.ఐ.కార్యాలయం వద్ద ధర్నా చేపట్టడం జరిగిందని తెలిపారు.ఈ ధర్నాలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చార

## మహిళా సంఘాల రుణాల పంపిణీకి పూర్తి సహకారం

**ఇండియన్ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్ కుమార్**

తంబళ్లపల్లె, జూన్ 3 :తంబళ్లపల్లె మండలం లోని ఐకెపి ఆధ్వర్యంలోని మహిళా సంఘాలకు రుణాల పంపిణీకి పూర్తి సహకారం అందిస్తామని నూతన ఇండియన్ బ్యాంక్ మేనేజర్ జి.ప్రవీణ్ కుమార్ హామీ ఇచ్చారు. మంగళవారం ఐకెపి కార్యాలయంలో ఏపీఎం గంగాధర్ , సీసీలు, నూతన మేనేజర్ ప్రవీణ్ కుమార్ కు శుభాకాంక్షలు అందజేసి స్వాగతించారు.ఈసమీక్షలో మేనేజర్ మహిళా సంఘాల సభ్యులు ఐకమత్యంతో బ్యాంకుల ద్వారా పొందిన రుణాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. మహిళా సంఘాలకు పాడి పరిశ్రమ, చిన్న వ్యాపారాలు, వారు కోరిన వ్యాపార నిమిత్తం రుణాలు అందించడం జరుగుతుందన్నారు. ఏటీఎం గంగాధర్ మాట్లాడుతూ మహిళా సంఘాలకు రుణాల పంపిణీలో ఇండియన్ బ్యాంక్ సహకారం మరువలేమన్నారు. భవిష్యత్తులో బ్యాంకు రుణాల చెల్లింపులో మహిళా సంఘాలు ముందు ఉంటాయని సూచించారు. ఈ సమీక్షలో సీసీలు రమణ, ఆదిలక్ష్మి, కత్తి నరసింహులు, టిడిపి నాయకుడు నాగరాజు నాయక్ లు పాల్గొన్నారు.

## ఏటీఎంలో చోరీయత్నం






జిన్నారం జూన్ 03 ( లక్ష్యం ప్రతినిధి)జిన్నారం బొల్లారం మున్సిపల్ పరిధిలో తెల్లవారు జామున 03:01 నుండి 03:24 మధ్యలో గుర్తు తెలియని నేరస్తుడు బీరప్ప బస్తీ, బొల్లారం లో గల %HDFC ATM% ను పగులగొట్టి డబ్బులు దొంగతనం చేయుటకు ప్రయత్నం చేయడంతో ఏటీఎంలో సైరన్ శబ్దంతో చోరీ చేసే యత్నం విఫలం అయినాడు.

## అయ్యప్ప స్వామి దేవాలయ శంకుస్థాపనకు మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావుకు ఆహ్వానం

చిలకలూరిపేట జూన్ 3 లక్ష్యం న్యూస్ ):నాదెండ్ల మండలం, గణపవరం గ్రామజనసేన యువ నాయకులు మండలనేని చరణ్ తేజ, మరియు అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గురువారం మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావును



ఆయన నివాసంలో కలిశారు. గణపవరం గ్రామంలో నిర్మించనున్న అయ్యప్ప స్వామి దేవాలయం నూతన శంకుస్థాపన మహోత్సవానికి రావాలని ఈ సందర్భంగా వారు ప్రత్తిపాటి పుల్లారావును సాదరంగా ఆహ్వానించారు. ఈ నెల జూన్ 5, 2025 గురువారం ఉదయం 7:52 నిమిషాలకు అయ్యప్ప స్వామి దేవాలయం నూతన శంకుస్థాపన మహోత్సవం జరగనుంది. ఈ ఆలయ నిర్మాణానికి స్థల దాతలు దివంగత మండలనేని లక్ష్మయ్య కాగా, వారి కుమారులు మండలనేని శ్రీనివాసరావు, మండలనేని వెంకటేశ్వర్లు, మరియు మండలనేని సుబ్బారావు ఈ నిర్మాణంలో పాలుపంచుకుంటున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ శంకుస్థాపన మహోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది.

## సైకిల్ ఎక్కిన ఎమ్మెల్సీ

### సైక్లింగ్ అనేది ఆరోగ్యకరమైన రవాణా మార్గం: ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్ జూన్ 03 ( లక్ష్యం ప్రతి )కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో ఈరోజు ప్రపంచ బైసైకిల్ దినోత్సవం సందర్భంగా మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కార్యాలయం ఆవరణలో సైక్లింగ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ సైకిల్ దినోత్సవం అనేది ఏ లక్షణంతో సంబంధం లేకుండా అందరూ ప్రజలు ఆనందించాల్సిన ప్రత్యేక రోజు. మానవ పురోగతి మరియు పురోగతికి చిహ్నంగా సైకిల్ "సహనం, పరస్పర అవగాహన మరియు గౌరవాన్ని ప్రోత్సహిస్తుంది మరియు



సామాజిక సమ్మిళితత్వాన్ని మరియు శాంతి సంస్కృతిని సులభతరం చేస్తుందన్నారు. స్థిరమైన రవాణాకు చిహ్నం మరియు స్థిరమైన వినియోగం మరియు ఉత్పత్తిని ప్రోత్సహించడానికి సానుకూల సందేశాన్ని అందిస్తుంది మరియు వాతావరణ పై సానుకూల ప్రభావాన్ని చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, కోలుకుల జగన్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మరియు హైదరాబాద్ సైక్లింగ్ గ్రూప్ మెంబర్స్ భీమ్ సింగ్, గడిలా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధి గణపతి, అభయాంజనేయస్వామి వార్ల గ్రామోత్సవంలో పాల్గొన్న ప్రత్తిపాటి









చిలకలూరిపేట జూన్ 3 (లక్ష్యం న్యూస్ ):శ్రీ సిద్ధిగణపతి, శ్రీ అభయాంజనేయస్వామి, సీతలాంబ తల్లి బొడ్డురాయి ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా తలపెట్టిన గ్రామోత్సవాన్ని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. మంగళవారం యడ్లపాడు మండలం జగ్గాపురంలో జరిగిన గ్రామోత్సవంలో పాల్గొన్న ప్రత్తిపాటి ప్రజలతో కలిసి స్వామివార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన హోమంలో పాల్గొని అర్చకుల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతం ప్రతిష్ఠా మహోత్సవ ఏర్పాట్లపై గ్రామస్తులు, కార్యక్రమాల నిర్వాహకులతో మాట్లాడారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, స్వామివార్ల అనుగ్రహం లభించేలా శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా ప్రతిష్టామహోత్సవం నిర్వహించాలని ప్రత్తిపాటి సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, కామినేని సాయిబాబు, ముద్దన నాగేశ్వరరావు, వీరారెడ్డి, శ్రీనివాసరెడ్డి, కందిమళ్ళ రఘురామారావు, సుబ్బారావు, శంకర్రావు, గట్టినేని విజయ్ సాయి, పోపూరి వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, ముద్దన పార్థసారథి, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ వ్యవస్థ గాడి తప్పింది మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి



తెనాలి జూన్ 3(లక్ష్యం)దళిత మైనార్టీలను అణచివేసేందుకు టార్గెట్ గా పెట్టుకున్న కూటమి వ్యవస్థ పోలీసుల ద్వారా అమాయకుల పై తప్పుడు కేసులు బనాయించి, నడి బజార్లో అరికాళ్ల కోటింగ్ ఇవ్వడం ఎంతవరకు న్యాయమని, ఇది కూటమి ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గపు పాలన అని, మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైయస్. జగన్మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం, తెనాలిలో ముగ్గురు యువకులపై పోలీసులు జరిపిన దాడిపై బాధిత కుటుంబాలను ఆయన స్వయంగా వచ్చి పరామర్శించి, వారి నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముగ్గురు యువకులు అమాయకులని వారిలో ఒకరు న్యాయవాది కాగా, మరొకరు ఇంజనీర్ అని, పోలీసులు వారి కుటుంబాల పరువును బజారుకీడ్చి ఇంత దారుణంగా హింసించి అతి దారుణంగా కొట్టారని దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాధ్యులైన అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. న్యాయస్థానాలు తేల్చాల్సిన న్యాయ నిరూపణలను, పోలీసులే తేలుస్తున్నారని, ఇది న్యాయమా అని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు పై 24 కేసులు ఉన్నాయని, మరి పోలీసులు దీనికి ఏం సమాధానం చెప్తారని అన్నారు. పోలీసులు చేస్తున్న అరాచకాలను, ప్రశ్నిస్తున్న వారిపై కేసులు పెట్టి, అందులో మహిళలను కూడా చూడకుండా, హింస పెడుతున్నారని, ఇది కూటమి ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. ఈ పద్ధతి ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించి రాష్ట్రం అధోగతి పాలవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జగన్ రాకతో జనం కట్టలు తెంచుకొని, బారులు తీరారు. నందివెలుగు వైపు నుండి ఐయితా నగర్ వరకు, బైకులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

## ఏపీజీఈఏ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు జయప్రదం చేయాలి యూనిట్ అధ్యక్షులుఅందెబాలచంద్రమౌళి



కొల్లిపర జూన్ 3(లక్ష్యం) ఈ నెల 5వ తేదీన ఎస్ ఎస్ కన్వెన్షన్ బందర్ రోడ్ విజయవాడలో జరుగనున్న రాష్ట్రకౌన్సిల్ సమావేశానికి ఉద్యోగ, ఉపాధ్యాయ,పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి అందరూ హాజరుకావాలని దుగ్గిరాలయూనిట్అధ్యక్షులు అందెబాల చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి టి.మనోహర్ రెడ్డి, ఉపాధ్యక్షులు గుంటూరుపూర్ణ ప్రసాద్ కోరారు. జిల్లా ఐక్యవేదిక చైర్మన్ సయ్యద్ చాంద్ భాషా మౌఖిక ఆదేశాల ప్రకారం మంగళవారం కొల్లిపర తహసిల్దార్,మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది,పంచాయతీ, రిజిస్ట్రేషన్ సిబ్బందిని కలసి సమావేశమునకు ఆహ్వానించడం జరిగినది. ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కు వివరిస్తామని,ఉద్యోగుల పక్షపాతిగా మన ముఖ్యమంత్రి మన మనస్సులలో స్థిరస్థాయిగా గుర్తుండేటట్లు మంచి పిఆర్ సి ఇస్తారనేఆశాభావం వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులుషేక్ మీరావలి, జాయింట్ సెక్రెటరీ నూకవరపు శ్రీలక్ష్మీ కుమారి,కార్యవర్గసభ్యులు కొల్లిపరమండలసబ్ రిజిస్ట్రార్. ఎం.ఆదినారాయణరెడ్డి, డిప్యూటీతహసీల్దార్ రాజేష్, పరిపాలనాధికారి ప్రతాపరెడ్డి, రెవెన్యూఇన్స్పెక్టర్ వంశీకృష్ణ సీనియర్అసిస్టెంట్ శ్రీనివాసరావు,ఎం.శ్రీలక్ష్మీ కుమారి, వీఆర్వోలు భాస్కర్,సుష్మ, ప్రసాద్ సచివాలయసిబ్బంది తదితరులు పాల్గొన్నారు. రేపటి సమావేశమునకు ప్రభుత్వం వారు తరుపున సమావేశమునకు హాజరగు ఉద్యోగస్తులందరికీ ప్రభుత్వం వారు ప్రత్యేక సెలవు దినము ప్రకటించినందున ఉద్యోగస్తులందరూ తప్పక హాజరు కావలసినదిగా కోరినారు.

## జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ తో సమావేశమైన ఎమ్మెల్యే జిఎంఆర్



పటాన్చెరు జూన్ 03 (లక్ష్యం ప్రతినిధి)బల్దియా పరిధిలోని భారతి నగర్, పటాన్చెరు, రామచంద్రపురం డివిజన్ల పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలలో మౌలిక వసతులు, అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించాలని.. నూతన పారిశుద్ధ్య వాహనాలు పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు సహకారం అందించాలని శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ ను పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కోరారు.మంగళవారం శేరిలింగంపల్లి జిహెచ్ఎంసి. జోనల్ కమిషనర్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ హేమంత్ తో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మూడు డివిజన్ల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు, పెండింగ్ పనులపై చర్చించారు. పారిశుద్ధ విభాగంలో దీర్ఘకాలంగా సెలవులో ఉన్న ఉద్యోగులు, చనిపోయిన వారి స్థానాల్లో నూతన ఉద్యోగులను నియమించాలని కోరారు. పటాన్చెరు డివిజన్ పరిధిలో నిర్మిస్తున్న ఆడిటోరియం, కమ్యూనిటీ హాల్స్, వార్డ్ ఆఫీస్ నిర్మాణ పనులు చాలా రోజులుగా నిలిచిపోయాయని.. వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆడిటోరియం, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణ పూర్తయితే ప్రభుత్వ ప్రైవేటు కార్యక్రమాలకు ఆధునిక వసతులతో కూడిన భవనం అందుబాటులోకి వస్తుందని తెలిపారు..పారిశుద్ధ్య విభాగంలో వాహనాల కొరత మూలంగా చెత్త సేకరణ ఇబ్బందిగా మారుతోందని.. వెంటనే నూతన వాహనాలతో పాటు మినీ టిప్పర్లు, నిచ్చెనలతో కూడిన వాహనాలను కేటాయించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ హేమంత్.. అతి త్వరలో సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సురేష్, ఎస్ ఈ శంకర్ నాయక్, డి ఈ నరేందర్, దేవేందర్, ఏఈ శివ తదితరులు పాల్గొన్నారు.

## స్వరాజ్యమ్మ చిత్రపటానికి నివాళులర్పించిన ప్రత్తిపాటి



చిలకలూరిపేట జూన్ 3(లక్ష్యం న్యూస్): నాదెండ్ల మండలం, అవిశాయపాలెం గ్రామంలో జరుగుచున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి గుర్రం నాగపూర్ణచంద్రరావు అత్తయ్య పునాటిస్వరాజ్యమ్మపెద్దకర్మ కార్యక్రమానికి మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు హాజరై, ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి,వారికుటుంబసభ్యులను పరామర్శించరు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నెల్లూరి సదాశివరావు, మద్దూరి వీరా రెడ్డి, జవ్వాజి మదన్, కామినేని సాయిబాబా మరియు మండల, గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో చనిపోయిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుని కుటుంబానికి 5 లక్షల రూపాయల చెక్కు అందజేత

చిలకలూరిపేట జూన్ 3(లక్ష్యం న్యూస్)::నాదెండ్ల మండలం, గణపవరం గ్రామానికి చెందిన జనసేన పార్టీ క్రియాశ్రీలక సభ్యుడు గజ్జ. శ్రీకాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం జరిగింది. అతనికి జనసేన పార్టీ క్రియా శీలక సభ్యత్వం ఉండటం వలన పార్టీ నుండి ఐదు లక్షల రూపాయలు ప్రమాద బీమా చెక్కును వారి కుటుంబ సభ్యులకు సోమవారం మంగళగిరిలోని ఆర్ ఆర్ ఆర్ ఫంక్షన్ హాల్ వేదికగా ఎమ్మెల్సీ కె .నాగబాబు అందజేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో శ్రీకాంత్ కుటుంబ సభ్యులు జనసేనపార్టీ సమన్వయకర్త తోట రాజా రమేష్ ని కలిసి జనసేన పార్టీ అధ్యక్షులు




పవన్ కళ్యాణ్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగ రాజా రమేష్ మాట్లాడుతూ దేశంలోనే పార్టీ కార్యకర్తల బాగోగులు గురించి ఆలోచించే పార్టీ జనసేన అని అన్నారు. చనిపోయిన శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు పార్టీ తరపున పూర్తిగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు మండలనేని చరణ్ తేజ, జిల్లా సంయుక్త కార్యదర్శి షేక్. సుభాని, పఠాన్ ఖాదర్ బాషా, పాపన హనుమంతరావు, శరత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధుల విడుదల : ప్రత్తిపాటి

**- వివిధరకాల పనులకు రూ.9.45కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు : ప్రత్తిపాటి**

**- నియోజకవర్గ ప్రజల తరుపున ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు : ప్రత్తిపాటి**

"చిలకలూరిపేట జూన్ 3(లక్ష్యం న్యూస్)పట్టణంలోని ఏరియా వైద్యశాల (100 పడకల ఆసుపత్రి) అభివృద్ధికి సంబంధించిన నిధుల మంజూరు ఉత్తర్వులు వెలువడటం సంతోషంగా ఉంది. గత అసెంబ్లీ సమావేశాల్లో రైతుల సమస్యలతో పాటు ఆసుపత్రి అభివృద్ధి ఆవశ్యకతను, రోగుల ఇబ్బందులను ప్రభుత్వానికి తెలియచేయడం జరిగింది. ఆనాడే శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో తాను అడిగిన ప్రశ్నలకు వైద్యారోగ్య శాఖమంత్రి సత్యకుమార్ స్పందించారు. ప్రాధాన్యతల ప్రకారం వీలైనంత త్వరగా నిధులు విడుదలయ్యేలా చూస్తామని మంత్రి చెప్పడం జరిగింది. ఆ క్రమంలో భాగంగా తాజాగా ప్రభుత్వం నుంచి రూ. 9.45కోట్లు విడుదలైనట్టు ఉత్తర్వులు



వెలువడ్డాయి. ఏరియా ఆసుపత్రిలోని సమస్యలు, రోగుల ఇబ్బందుల పై గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించింది. ప్రజలు, వైద్యసిబ్బంది ఎన్నిసార్లు సమస్యల గురించి చెప్పినా, గత పాలకులు పట్టించుకోలేదు. కూటమిప్రభుత్వం ఏర్పడ్డాక సమస్య నా దృష్టికి వచ్చిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియచేశాను. చేపట్టాల్సిన పనుల వివరాలతో సమగ్ర నివేదిక తయారుచేసి, రాష్ట్ర వైద్యారోగ్య శాఖాధికారులకు అందించడం జరిగిందని మాజీ మంత్రి శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు.

**చేయబోతున్న అభివృద్ధి పనులు...** ఆ నిధులతో ఆసుపత్రి కాంపౌండ్ వాల్ పాటు, ఆసుపత్రిలో అంతర్గత సీ.సీ.రోడ్ల నిర్మాణం చేపట్టబోతున్నాం. అలానే అంబులెన్స్ షెడ్, పార్కింగ్ షెడ్, బ్లడ్ బ్యాంక్ దోభీ ఘాట్ల నిర్మాణంతో పాటు. పాతభవ నం మరమ్మతులు చేపట్టబోతున్నాం. అలానే వైద్యపరికరాలు, జనరేటర్, మోడర్న్ కిజెన్ ఏర్పాటు చేయనున్నాం. ఈ పనులన్నీ సకాలంలో పూర్తిచేసి, ఆసుపత్రి సిబ్బంది... రోగులకు అందుబాటులోకి తీసుకొ స్తాం. ప్రజల ఇబ్బందులను గ్రహించి ఆసుపత్రి అభివృద్ధిపనులకు నిధులు మంజూరుచేసిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు నియోజకవర్గ ప్రజల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం" అని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఒక ప్రకటనలో తెలియచేశారు.

# తెలుగువారి చారిత్రక వైభవానికి, వారసత్వానికి ప్రతీక కొండవీడుకోట

## మాజీ రాజ్యసభ సభ్యుడు, రాజకీయ విశ్లేషకుడు డాక్టర్ తులసిరెడ్డి






యడ్లపాడు జూన్ 3 (లక్ష్యం న్యూస్ ):మండలంలోని చారిత్రక ప్రసిద్ధి గాంచిన కొండవీడుకోటను మాజీ రాజ్యసభ సభ్యుడు, రాజకీయ విశ్లేషకుడు డాక్టర్ తులసిరెడ్డి మంగళవారం సందర్శించారు. ముందుగా ఘాట్‌రోడ్డు, మహాద్వారం, పిల్లల క్రీడాపార్కు, తూర్పు ద్వారము (కట్టిలదిద్ది వాకిలి), లక్ష్మీనరసింహస్వామి ఆలయం, వేమన మండపం, అనవేమారెడ్డి విగ్రహం, చారిత్రక అంశాలను వివరించే గ్యాలరీ, ముత్యాలమ్మ, పుట్టాలమ్మ, వెదుళ్ల చెరువు డెక్కు ప్రాంతాలతో పాటు కొండపై ఉన్న చారిత్రక ప్రదేశాలను ఎంతో ఆసక్తిగా తిలకించారు. కత్తులబావి సందర్శనకు వెళ్లగా కోటగ్రామస్తులు సాదరస్వాగతం పలికారు. కొండవీటి కైఫియత్తు ఆధారంగా 72 మంది పాలెగాండ్ల తిరుగుబాటును అణచివేసేందుకు బావిలో కత్తులు అమర్చి జరిగిన ఘోర ఘటనను కల్లి శివారెడ్డి వివరించారు. అక్కడ నుంచి హౌస్ గణేష్‌పాడులోని అఖిలభారత రెడ్లసంక్షేమ సమాఖ్య ఏర్పాటు చేసిన కొండవీటి రెడ్డిరాజుల వారసత్వ ప్రదర్శనశాలను సందర్శించారు. అక్కడ ఇటీవల లభ్యమైన పురాతన ఖడ్గాన్ని, రాతి ఫిరంగి గుండును తులసిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండవీడుకోటను పుస్తకాల్లో తప్ప క్షేత్రస్థాయిలో చూడటం తొలిసారి అన్నారు. గ్రంథాల్లో రాసిన వాటికంటే వీటి ప్రాముఖ్యత ఎంతో గొప్పదనే అభిప్రాయం కలిగిందన్నారు. అద్దంకి నేల రాజధానిని కొండవీడు కొండలపై గిరిదుర్గంగా చేసుకుని వందేళ్లకు పైగా శతదుర్భేద్యంగా పాలించారని, కవిత్రయంలో ఎర్రప్రెగడ, కవిసార్వభౌముడు శ్రీనాధుడు, ప్రజాకవి వేమన, పెదకోమటి వేమారెడ్డి వంటి మహాపండితులకు కొండవీడు నిలయమై ఎన్నో గ్రంథాలకు జీవమిచ్చిందన్నారు. ఘాట్‌రోడ్డులు తనకు ఎంతో నచ్చాయని, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పర్యాటకంగా కొండవీడును మరింత అభివద్ధి చేయాలని కోరారు. మ్యూజియంను ప్రైవేట్ స్థాయిలో నిర్వహించడం అభినందనీయమని, యాజమాన్యం మరిన్ని వస్తువులు మ్యూజియంలో ఏర్పాటు చేస్తే పర్యాటకులకు మరింత ఆసక్తిని కలిగించగలదని సూచించారు. ప్రదర్శనశాల వారు 'కొండవీడు' అనే గ్రంథాన్ని తులసిరెడ్డికి బహుకరించారు. కార్యక్రమంలో ప్రదర్శనశాల కన్వీనర్ బొడపాటి అంజిరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఎం రాధాకృష్ణ, యడ్లపాడు, నాదెండ్ల మండలాల కాంగ్రెస్‌పార్టీ నాయకులు, మ్యూజియం మేనేజర్ నారాయణరెడ్డి, ఉద్యోగులు కొండబోయిన వెంకటేశ్వరరావు, మరియమ్మ, కొండవీడుకోట కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి ఉన్నారు.

# భారీ వర్షాలను ఎదుర్కోడానికి సన్నద్ధంగా ఉండాలి

## ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకూడదు మూడు రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చెయ్యాలి - కలెక్టర్ టీఎస్ చేతన్



పుట్టపర్తి:ప్రస్తుత వర్షాకాలంలో వచ్చే మూడు నెలలపాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, దీనిని ఎదుర్కొనడానికి యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు రాబోయే మూడు నెలల కాలంలో జిల్లాలో భారీగా వర్షాలు కురుస్తాయని ముందిస్తూ ఏర్పాట్లు భాగంగా సంబంధిత శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎస్పీ వీ రత్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాబోవు మూడు నెలల కాలంలో వర్షాల కారణంగా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకూడదని స్పష్టం చేశారు. అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలే కాకుండా, ఒకవేళ ఏదైనా అనుకోని ప్రమాదం సంభవిస్తే, ఆ తరువాత చేపట్టాల్సిన చర్యలపై కూడా సన్నద్ధంగా ఉండాలని సూచించారు. దీనికోసం అన్ని శాఖలు క్షేత్రస్థాయిలో పర్యటించి, మూడు రోజుల్లోగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. సన్నద్ధతపై ఆర్‌డిఓలు వారానికిసారి తమ డివిజన్‌లో సమీక్ష నిర్వహించి నివేదికను అందించాలని సూచించారు. నీటి పారుదల శాఖ జిల్లాలో వర్షాల కారణంగా చెరువులకు, కాలువలకు ఎక్కడా గండి పడకుండా చూడాలని, దీనికోసం ముందుగానే వాటిని పరిశీలించి నివేదిక తయారు చేయాలని కలెక్టర్ చెప్పారు.నీటిపారుదల శాఖ ట్యాంకుల నీటి మట్టాల నివేదికలను ప్రతి 3 రోజులకు ఒకసారి నివేదికలు నాకు సమర్పించాలి. మండల స్థాయిలో ఎంపిడిఓ, తాహసీల్దార్, నీటిపారుదలశాఖ ఏఈలు కమిటీగా ఏర్పాటై, క్షేత్రస్థాయి పరిస్థితులను స్వయంగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని సూచించారు. గండి పడే అవకాశం ఉన్నచోట తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీలు మున్సిపల్ ప్రాంతాల్లోని అన్ని రోడ్లు, డ్రైన్లను పరిశీలించాలని, లోతట్టు ప్రాంతాలు మునిగిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే రోడ్లు కొట్టుకుపోయి ప్రజలు ఇబ్బంది పడకుండా, ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా చూడాలని అన్నారు. వర్షపు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చూడాలన్నారు. త్రాగునీరు, పారిశుధ్యంపై దృష్టి పెట్టాలన్నారు. పంచాయితీ శాఖ గ్రామాల్లో ప్రతిరోజూ పారిశుధ్య పనులను నిర్వహించాలని, దోమలు విజృంభించకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యంగా ఈ సీజన్‌లో మలేరియా, డెంగీ, విష జ్వరాలు విజృంభించే అవకాశం ఉందని, దానిపై దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై పంచాయితీ కారర్యదర్శులు, ఈఓపిఆర్‌డిలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వైద్యారోగ్యశాఖ వ్యాధులు విజృంభించకుండా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. అన్ని రకాల మందులను ముందుగానే సిద్ధంగా ఉంచాలన్నారు. అవసరమైతే వైద్య శిబిరాలను నిర్వహిచేందుకు సైతం సిద్ధం కావాలన్నారు. నిరంతరం వైద్య పరీక్షలను నిర్వహించాలని, ఆశా, ఏఎన్‌ఎంలు ప్రతిరోజూ గ్రామాల్లోకి వెళ్లి ప్రజల ఆరోగ్యపరిస్థితిపై వాకబు చేయాలని ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా వర్షాకాలంలో త్రాగునీరు కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ఎక్కడా నీటి కొరత తలెత్తకూడదని స్పష్టం చేశారు. ప్రతిరోజూ క్లోరినేషన్ చేయాలని, ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభం చేయాలని సూచించారు. చేతి బావులవద్ద పరిసరాలు పరిశుభ్రంగా ఉండేటట్టు చూడాలన్నారు. త్రాగునీటి పథకాల దగ్గర నీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. విద్యుత్ శాఖ వర్షాలు, ఈదురు గాలుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, స్థంబాలు నేలకొరగడం, వైర్లు తెగిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం తదితర ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వీటిని వీలైనంతవరకు నివారించేందుకు చర్యలు తీసుకోవాలని, అవసరమైన సామగ్రిని సిద్దంగా ఉంచాలని చెప్పారు. దీనికోసం ముందుగానే గ్రామాల్లో పర్యటించి పాడైన విద్యుత్ స్తంభాలను, వేలాడే వైర్లను గుర్తించాలని సూచించారు. రెవెన్యూ శాఖ వర్షాలవల్ల ప్రమాదాలు జరగకుండా సిద్దంగా ఉండటంలో రెవెన్యూ శాఖది కీలక పాత్ర అని అన్నారు. పిడుగుల బారిన పడకుండా ప్రజలను చైతన్యవంతులను చేయాలని చెప్పారు. దీనికోసం విస్తృత ప్రచారం చేయాలన్నారు. కల్వర్టులు, వంతెలన వద్ద నీటి ప్రవాహం వల్ల ప్రమాదాలు జరగకుండా ముందుజాగ్రత్త చర్యలు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, తాళ్లతో బారికేడ్లు కట్టి ప్రజలను హెచ్చరించాలని చెప్పారు. పాఠశాల భవనాల దుర్బల నిర్మాణాలను గుర్తించి, ఆ వివరాల నివేదికను సమర్పించాలి. సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సూర్య నారాయణ రెడ్డి, డి ఎం హెచ్ ఓ ఫిరోజ్ బేగం, డిపిఓ సమత, డిఆర్డిఏ పిడి నరసయ్య, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు సుబ్బారావు, చంద్రశేఖర్, పద్మావతి, సుభదాస్, సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**దేవాలయ భూములను అన్యాకృతం కాకుండా కాపాడాలి – జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్...** దేవాలయ భూములను అన్యాకృతం కాకుండా కాపాడాలి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కన్ఫరెన్స్ హాల్ నందు దేవాలయ భూములను పరిరక్షణపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వి రత్న, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడెక్కడ దేవాలయ భూములు ఉన్నాయో సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు, ధర్మవరం డివిజన్ నందు దేవాలయ భూములను దురాక్రమనకు గురికాకుండా కాపాడాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ అధికారి నరసింహ రాజు, సర్వే ల్యాండ్ అండ్ రికార్డ్ అధికారి విజయశాంతి భాయ్, డిపిఓ సమత, జిల్లా రిజిస్టర్, ఆర్ అండ్ బి ఇంజనీర్ పాల్గొన్నారు.

# సోడిశెట్టి మంజు భార్గవి తనకు జరిగిన మోసం, వంచనపై పల్నాడు జిల్లా ఎస్పీకి స్పందనలో ఫిర్యాదు

## ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నారా లోకేష్, హోంమంత్రి అనితలకు విజ్ఞప్తి





చిలకలూరిపేట జూన్ 3(లక్ష్యం న్యూస్)::: నాదెండ్ల మండలం, ఇర్లపాడు గ్రామానికి చెందిన సోడిశెట్టి మంజు భార్గవి తనకు జరిగిన మోసం, వంచనపై పల్నాడు జిల్లా ఎస్పీకి స్పందనలో ఫిర్యాదు చేశారు. ఏఆర్ కానిస్టేబుల్ మేకల నరేంద్ర, ధర్మవరపు దుర్గాప్రసాద్ తనను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారని ఆమె ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి, పవన్ కళ్యాణ్, లోకేష్ లకు విజ్ఞప్తి చేస్తూ ఒక వీడియోను కూడా విడుదల చేశారు.

**బాధితురాలి ఆవేదన**

సోడిశెట్టి మంజు భార్గవి తన చదువు నిమిత్తం అమ్మమ్మ ఊరైన అద్దంకికి వెళ్లినప్పుడు విశ్వభారతి జూనియర్ ఇంటర్ కాలేజీ డైరెక్టర్, దూరపు బంధువు అయిన సోడిశెట్టి రామానాయుడు తనను ప్రేమ పేరుతో లోబరుచుకుని గర్భవతిని చేశాడని తెలిపారు. అధిక కట్నం, ఆస్తులకు ఆశపడి తనను మోసం చేసి వేరొకరిని పెళ్లి చేసుకోవడానికి సిద్ధమయ్యాడని పేర్కొన్నారు. దీనిపై 2022 ఫిబ్రవరి 8న నరసరావుపేట దిశ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టగా, రామానాయుడు తల్లి సోడిశెట్టి వెంకటసుబ్బమ్మ, బంధువులు ధర్మవరపు దుర్గాప్రసాద్, మేకల నరేంద్ర (ఏఆర్ కానిస్టేబుల్) వచ్చి పెళ్లి చేస్తామని నమ్మబలికి తీసుకెళ్లారని వివరించారు.

**బలవంతపు వివాహం, బెదిరింపులు**

బంధువులు కావడంతో వారి మాటలు నమ్మి తాను వెళ్లగా, తన అత్తగారు సోడిశెట్టి వెంకటసుబ్బమ్మ, ఇతర బంధువులు రామానాయుడు కంటే అతని తమ్ముడు సోడిశెట్టి కామేశ్వరరావును పెళ్లి చేసుకోవాలని, అతను ఏ లోటూ లేకుండా చూసుకుంటాడని చెప్పారని మంజు భార్గవి తెలిపారు. తాను అంగీకరించకపోయినా, బలవంతం చేసి బెదిరించి, రామానాయుడు సోదరుడు కామేశ్వరరావుతో కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో గుడిలో వివాహం చేశారని పేర్కొన్నారు. పెళ్లయిన మూడు రోజుల తర్వాత అద్దంకికి వచ్చామని, ఆ తర్వాత 16 రోజుల పండుగకు వస్తానని చెప్పి తన భర్త వెళ్లిపోయాడని, అప్పటినుంచి రామానాయుడు అసభ్యకరమైన వాట్సాప్ మెసేజ్‌లు పెడుతూ, మానసికంగా వేధిస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయం తన భర్తకు చెప్పగా, తన అన్న గురించి ఏమి చెప్పినా విననని, తనకు తగిన శాస్తి చేశామని ఫోన్ పెట్టేశాడని, అత్తయ్యకు చెబితే తనకు తెలియదని, ఏంచేసుకుంటావో చేసుకోమని బెదిరించిందని బాధితురాలు వాపోయారు.

**నిరాదరణ, తప్పుడు ప్రచారం**

చేయగలిగింది ఏమీ లేక తన పుట్టిల్లు అయిన ఇర్లపాడు గ్రామం వచ్చి పెద్దలతో చెప్పగా, అత్తింటివారు "వాడు ఎక్కడున్నాడో తెలియదు, వెతుకుతున్నాం" అని 14 నెలలు కాలయాపన చేశారని మంజు భార్గవి తెలిపారు. 2023 ఏప్రిల్ 27న తన తల్లిదండ్రులు, తమ్ముళ్లతో కలిసి అత్తవారింటికి వెళ్లగా, అత్తయ్య బంధువులతో మాట్లాడి తన భర్త వచ్చే వరకు అక్కడే ఉంటానని చెప్పి, తన తల్లిని కూడా తనతో ఉండేలా చేసి తన తల్లిదండ్రులు వెళ్లారని వివరించారు. తెల్లవారేసరికి అత్తయ్య చెప్పా పెట్టకుండా ఇల్లు వదిలి వెళ్లారని, అప్పటినుంచి తాను, తన తల్లి అక్కడే ఉంటున్నామని పేర్కొన్నారు.

అయినా రామానాయుడు, ధర్మవరపు దుర్గాప్రసాద్, ఏఆర్ కానిస్టేబుల్ మేకల నరేంద్ర అద్దంకి పట్టణంలో తన గురించి చెడుగా ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. 2023లో తనపై, బంధువులపై ఫిర్యాదు చేసినట్లు ఇటీవల అద్దంకి పోలీసులు చెప్పేవరకు తమకు తెలియదని, పోలీసులు ఫోన్లు చేసి తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. ఏఆర్ కానిస్టేబుల్ మేకల నరేంద్ర, ధర్మవరపు దుర్గాప్రసాద్ మనుషులను వెంటబెట్టుకొని వచ్చి విడాకులు ఇచ్చి ఇల్లు ఖాళీ చేసి వెళ్లాలని, లేకపోతే తమను, తమ బంధువులను ఇబ్బంది పెడతామని, మేనమామ పిల్లలు విదేశాలకు వెళ్లకుండా కేసులు పెడతామని బెదిరిస్తున్నారని తెలిపారు.

**ఫోన్ హ్యాకింగ్, హత్యాయత్నం**

తాను ఏమి తప్పు చేశామని జైలుకెళ్లాలని ప్రశ్నించిన మంజు భార్గవి, తన అత్తగారింటికి వెళ్లినప్పటినుంచి ధర్మవరపు దుర్గాప్రసాద్, మేకల నరేంద్ర, తన భర్త కామేశ్వరరావు, రామానాయుడు కలిసి తన ఫోన్‌ను హ్యాక్ చేసి, తనకు సంబంధం లేకుండా తన ఫోన్ నుంచి మెసేజ్‌లు, ఫోన్ కాల్స్ వెళ్లేటట్టు చేసి తనను చెడ్డదానిగా చిత్రీకరించడానికి ప్రయత్నించారని ఆరోపించారు. పలుమార్లు రామానాయుడు, తన అత్తయ్య ప్రోద్బలంతో ఏఆర్ కానిస్టేబుల్ మేకల నరేంద్ర, ధర్మవరపు దుర్గాప్రసాద్ తనపై హత్యాయత్నం చేసేందుకు ప్రయత్నించారని తెలిపారు.

**న్యాయం కోసం పోరాటం**

రామానాయుడు, ఏఆర్ కానిస్టేబుల్ మేకల నరేంద్ర, ధర్మవరపు దుర్గాప్రసాద్ ల వల్ల తనకు ప్రాణహాని ఉందని, తనపై, తన కుటుంబ సభ్యులపై తప్పుడు కేసులు పెట్టిస్తూ ఇబ్బంది పెడుతున్నారని మంజు భార్గవి ఆవేదన వ్యక్తం చేశారు. గోవింద అంబిక జూనియర్ కాలేజీ డైరెక్టర్‌గా పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉండి రామానాయుడు, సమాజ రక్షణ విభాగంలో ఉద్యోగం చేస్తున్న నరేంద్ర, ధర్మవరపు దుర్గాప్రసాద్ లు ముగ్గురూ కలిసి ఆడపిల్లలకు చేస్తున్న అన్యాయాలు నలుగురికీ తెలియాలని, తన జీవితం నాశనమైనట్లుగా మరే ఆడపిల్లలకు అన్యాయం జరగకుండా తనకు న్యాయం చేయాలని గౌరవ పల్నాడు జిల్లా ఎస్పీకి స్పందనలో ఫిర్యాదు చేశానని తెలిపారు. తనకు న్యాయం జరిగే వరకు న్యాయపోరాటం చేస్తానని, మీడియా సహకరించాలని కోరారు.

తనలా ఏ ఆడపిల్లలకు అన్యాయం జరగకుండా ఉండాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నారా లోకేష్, హోంమంత్రి అనితలకు విజ్ఞప్తి చేస్తూ వీడియో విడుదల చేస్తున్నానని, దయచేసి మీడియా వారందరూ సహకరించి ఈ వీడియో వారికి చేరేవరకు షేర్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

## జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా




కర్నూలు, :యోగా తో వేసి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ఆరోగ్య, ఆనంద ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు.మంగళవారం యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఓర్వకల్లు రాక్ గార్డెన్ వద్ద నిర్వహించిన యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో దాదాపు వెయ్యి మంది యోగభ్యాసకులు పాల్గొని యోగాసనాలు వేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జూన్ 21 వ తేది నిర్వహిస్తున్న ప్రపంచ యోగా దినోత్సవంలో కర్నూలు జిల్లా లో 10 లక్షల మంది పాల్గొనే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.. యోగాంధ్ర లో భాగంగా ఇప్పటికే మాస్టర్ ట్రైనర్లు, ట్రైనర్ లకు శిక్షణ కార్యక్రమాలు పూర్తయ్యాయన్నారు..ప్రస్తుతం గ్రామ స్థాయిలో పోటీ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు.. ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రాంతాలలో యోగా నిర్వహించాలనే థీమ్ లో భాగంగా ఈరోజు ఓర్వకల్లు రాక్ గార్డెన్ వద్ద యోగా కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నామన్నారు.. జూన్ 12 వ తేదీన కొండారెడ్డి బురుజు వద్ద, జూన్ 18 వ తేదీన మంత్రాలయం లో యోగా కార్యక్రమాలు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు.. అదే విధంగా 5 వేల మంది పారిశుధ్య కార్మికులతో జూన్ 17వ తేదీన కర్నూలు లో యోగా కార్యక్రమం నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి రోజు యోగా చేయడం ద్వారా ఆరోగ్యం చాలా బాగుంటుందన్నారు.. ప్రతి ఒకరు యోగా చేసి ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలనేది రాష్ట్ర ముఖ్యమంత్రి ఆకాంక్ష అన్నారు.. ప్రజలందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని జిల్లా లో యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21 వ తేదీన వైజాగ్ లో నిర్వహించనున్న యోగా దినోత్సవం కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు పాల్గొంటున్నారన్నారు.. ప్రతి రోజు కొంత సమయాన్ని యోగాకు కేటాయించడం ద్వారా మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. యోగా గురించి దేశంలో ఉన్న ప్రజలందరికీ తెలియజేయాలి, అందర్నీ యోగాలో భాగస్వామ్యులు చేయాలనే ఉద్దేశ్యంతోనే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్, యోగా గురువులు ముని స్వామి, విజయ్ కుమార్ఆధ్వర్యంలో యోగా ప్రోటోకాల్ ప్రకారం దాదాపు గంట సేపు యోగాసనాలు వేయించారు..కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ ముంతాజ్ బేగం, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, ఓర్వకల్లు పొదుపు ఐక్య సంఘం అధినేత విజయ భారతి, ఓర్వకల్లుఎంపిడిఓ శ్రీనివాసులు, తహసీల్దార్ సాగర్, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ డా.ప్రసాద్, యోగాభ్యాసకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

# ఆరోగ్యానికి మురిపాలు

కర్నూలు : కర్నూలు జిల్లాలో పాల ఉత్పత్తులు పెంచేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వివిధ రాయితీ పథకాలు అందజేస్తోంది. పేద కుటుంబాలకు ఆర్థిక చేయూతనిచ్చే ప్రణాళికలు రూపొందించింది. మరోవైపు విపణిని కల్తీ పాలు ముంచెత్తుతున్నాయి. చిక్కగా ఉండేందుకు.. వెన్న శాతం పెరిగేందుకు కొందరు అక్రమ పద్ధతులు అవలంబిస్తున్నారు. జనం ఆరోగ్యానికి ముప్పు కలిగిస్తున్నారు. నేడు ప్రపంచ పాల దినోత్సవం నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పరిస్థితిపై కథనం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 13.60 లక్షల కుటుంబాలున్నాయి. 20వ పశు గణనలో భాగంగా కర్నూలు జిల్లాలో 3,62,370, నంద్యాల జిల్లాలో 4,13,607 పశువులు ఉన్నట్లు అధికారులు లెక్క తేల్చారు. 35 శాతం కుటుంబాలు లూజు పాలు, 65 శాతం కుటుంబాలు ప్యాకెట్ పాలను వినియోగిస్తున్నట్లు అంచనా. పాల ఉత్పత్తి తక్కువగా ఉన్న నేపథ్యంలో ఇతర ప్రదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది.

**పాలపురికి తోడ్పాటు**

పాడి పరిశ్రమను మరింత అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అధికారులు ఇటీవల పీ4, ర్యాపిడో సర్వేలు నిర్వహించారు. మొదటి దఫాగా కర్నూలు జిల్లాలో 2,961, నంద్యాల జిల్లాలో 3,477 కలిపి మొత్తం 6,438 కుటుంబాలను గుర్తించారు. దాతల సహకారంతో వారిని పాడి పరిశ్రమ రంగం వైపు తీసుకెళ్లాలని.. పాడి గేదెలు ఇప్పించాలని నిర్ణయించారు. ఫలితంగా ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రణాళికలు రూపొందించారు.



**వినియోగం పెంచేలా..**

ఒక వ్యక్తికి సగటున రోజుకు 600 మిల్లీలీటర్ల పాలు తీసుకోవాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పరిశీలిస్తే రోజుకు 100 ఎంఎల్ కూడా తీసుకోవడం లేదు. పట్టణ ప్రాంతాల్లోనివారు.. ఆర్థికంగా ఉన్నవారు మాత్రమే తమ పిల్లలకు పౌష్టికాహారంగా పాలు ఇస్తున్నారు. కర్నూలు జిల్లాలో పత్తికొండ, మంత్రాలయం, ఎమ్మిగనూరు, హొళగుంద ప్రాంతాల్లో మాత్రమే పాల సేకరణ కేంద్రాలున్నాయి. నంద్యాల జిల్లాలో ప్రతి మండలంలో కనీసం నాలుగైదు పాల సేకరణ కేంద్రాలున్నాయి. ఉమ్మడి జిల్లాలో ప్రజల ఆరోగ్యం పెంపొందించేలా.. పాల వినియోగం పెంచేలా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోంది.

**6.50 లక్షల లీటర్ల కొరత**

ఉమ్మడి జిల్లాలో రోజుకు 13 లక్షల లీటర్ల పాలు అవసరం కాగా.. ప్రస్తుతం 6.50 లక్షల లీటర్లు మాత్రమే ఉత్పత్తి అవుతోంది. సగానికి సగం కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలతోపాటు పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రైవేటు డెయిరీ పాలను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఇదే అవకాశంగా కొందరు కృత్రిమ పాలను తయారుచేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

**పశు పోషకులకు ప్రోత్సాహం**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పశు పోషకులకు రాయితీపై మినీ గోకులం షెడ్లను మంజూరు చేసింది. ఉపాధి హామీ పథకం కింద వంద శాతం రాయితీపై పశుగ్రాసం పెంపకానికి సాయం అందిస్తోంది. తాజాగా 50 శాతం రాయితీతో సమీకృత పశుదాణా పంపిణీ చేస్తున్నారు. అవసరమైన రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాల్సి ఉంది. భారత్ పశుధన్ యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవడంతోపాటు పశువులకు టీకాలు వేయించి ఉండాలి. తెల్లరేషన్‌కార్డు కలిగినవారు అర్హులు. సమీకృత దాణాతో పశువుల్లో పోషకాలు పెరిగి పాల దిగుబడులు మెరుగవుతాయని అధికారులు పేర్కొంటున్నారు.

**ఇష్టానుసారంగా కల్తీ**

పాల కొరత నేపథ్యంలో ప్రైవేటు పాల వ్యాపారం పెద్దఎత్తున సాగుతోంది. పాలు ఎక్కువగా ఉన్న సమయంలో కొన్ని డెయిరీలు పొడిగా తయారు చేసుకుంటాయి. కొరత సమయంలో పొడిని పాలుగా మార్చి అమ్ముతున్నాయి. పాల ఉత్పత్తి చేసే రైతులకు లీటరుకు రూ. 2, రూ.3 ఆదాయం మాత్రమే వస్తుంది. కొందరు పాల వ్యాపారులు కల్తీ చేయడం ద్వారా లీటరుకు రూ.10కు పైగా లాభం పొందుతున్నారు. కల్తీ పాలతో జనం అనారోగ్యం పాలవుతున్నారు.

# బంగారు భవితకు కిశోరి వికాసం..!

శ్రీకాకుళం : జిల్లా వ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో కిశోరి వికాసం అవగాహన తరగతులు జరుగుతున్నాయి. మే 2న ప్రారంభమైన కార్యక్రమాలు ఈ నెల 10 వరకు కొనసాగనున్నాయి. ఇందులో భాగంగా మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కిశోరి బాలికలకు 10 అంశాలు వివరిస్తున్నారు. 11 నుంచి 18 ఏళ్లలోపు వయసు గల అమ్మాయిలు, 11 నుంచి 14 ఏళ్ల లోపు బడి బయట ఉన్న బాలికలను సమావేశపరుస్తున్నారు. కౌమార వయసులో బాలికలు ఎలా నడుచుకోవాలి.. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి ఏం చేయాలనేది సూచిస్తున్నారు.

జిల్లాలో ఇప్పటి వరకు 11 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు ఉన్న బాలికలకు విద్య, లక్ష్యం, నైపుణ్యాలు, ఆహారం, లింగ సమానత్వం, రుతుక్రమం వంటి 14 అంశాల గురించి వివరిస్తున్నారు. ఈ నెల 3న ఆడపిల్లల్లో నాయకత్వం లక్షణాలు పెంపొందించే తరగతులు, స్వయం సమృద్ధి సాధించేందుకు దోహదపడే అంశాలు, 6న క్రీడల ఆవశ్యకత, వ్యాయామం, వారిలో ఉండే ప్రతిభను గుర్తించేందుకు తరగతులు జరగనున్నాయి. శిబిరం ముగింపు రోజున బాల్య వివాహాల విషయంలో చైతన్య పరుస్తారు.

**చాలా విషయాలు తెలుసుకున్నాను..**

ఈ శిబిరం ద్వారా చాలా విషయాలు తెలుసుకున్నాను. వేసవి సెలవుల్లో జరగడంతో సద్వినియోగం చేసుకోగలిగాను. ఆరోగ్యం, విద్య, సమాజంలో బాలికలు నడవడిక, అప్రమత్తంగా వ్యవహరించడం అర్థమైంది. భవిష్యత్తులో ఎలాంటి లక్ష్యం నిర్ణయించుకోవాలి.. దాన్ని అధిగమించేందుకు ఎలా ముందుకు సాగాలనే దానిపై స్పష్టత వచ్చింది.- పి.శైలజ, 10వ తరగతి, రణస్థలం

**ప్రత్యేక కమిటీల ఏర్పాటు..** వివిధ శాఖల సమన్వయంతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి బాలికలకు అన్ని అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. అందులో అంగన్‌వాడీ కార్యకర్త, బహుళార్థ సార్థక ఆరోగ్య కార్యకర్త, గ్రామ, వార్డు సచివాలయ సహాయకులు, గుర్తింపు పొందిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఉంటారు. సంరక్షణ అధికారులుగా సచివాలయం సిబ్బంది కొనసాగుతారు. కార్యక్రమాన్ని జిల్లాలో పక్కాగా ప్రణాళికతో అమలు చేస్తున్నాం.- బి.శాంతిశ్రీ, పీడీ, శ్రీకాకుళం

# భద్రత ఇక బలోపేతం..



సింధియా : ఆపరేషన్ సింధూర్ తర్వాత భద్రతపై కేంద్ర ప్రభుత్వం ఎక్కువ దృష్టిపెట్టింది. కీలకమైన నగరాలు, అక్కడి ప్రజలు, సంస్థల భద్రతకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. ముఖ్యంగా తూర్పు తీరం వెంట ఉన్న జాతి సంపద కాపాడటమే ధ్యేయంగా కొన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారు. పోలీసు వెరిఫికేషన్ సర్టిఫికేట్ (పీవీసీ) సరిగా అమలు జరగడం లేదని గుర్తించారు. దాన్ని కచ్చితంగా అమలయ్యేలా చూస్తున్నారు.

తూర్పు కనుమల్లో పేరొందిన విశాఖ-డాల్ఫిన్‌హిల్స్ పరిసరాల్లోనే అత్యంత విలువైన, ముఖ్యమైన సంస్థలు ఉన్నాయి. భూగర్భ ప్రాజెక్టులైన 'దక్షిణాసియా ద్రవీకృత పెట్రోలియం వాయువు' (ఎస్‌ఏఎల్పీజీ), 'భారత వ్యూహాత్మక పెట్రోలియం నిల్వ సంస్థ' (ఐఎస్‌పీఆర్‌ఎల్) ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. అత్యవసర సమయాల్లో దేశ చమురు అవసరాలను ఈ సంస్థలు తీరుస్తుంటాయి. వీటికి సమీపంలోనే రక్షణ నౌకల స్థావరం, సరకు రవాణాకు సంబంధించిన పోర్టు, ఈస్టర్న్ నేవల్ కమాండ్, నేవల్ బేస్, హెచ్‌పీసీఎల్ చమురు శుద్ధి కర్మాగారం, ఐఓసీ, బీపీసీఎల్‌కు చెందిన ఇంధన నిల్వ భారీ ట్యాంకుల వంటివి ముఖ్య సంస్థలు, పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో పెద్దసంఖ్యలో కార్మికులు పనిచేస్తుంటారు.

**పీవీసీ లోపాలపై నిఘా..:** అయితే ప్రముఖ సంస్థల్లో పనిచేసే కార్మికులకు పోలీసు వెరిఫికేషన్ సర్టిఫికెట్ (పీవీసీ) సరిగా అమలు జరగని విషయాన్ని నిఘా సంస్థలు గుర్తించాయి. ఇతర రాష్ట్రాల నుంచి గుత్తేదారులు పెద్దఎత్తున ఒప్పంద కార్మికులను తీసుకొచ్చి ఇక్కడ పనులను నిర్వహిస్తుంటారు. వీరికి సీఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో అనుమతి పాసులను జారీ చేస్తుంటారు. అయితే ఇలా పాసులు పొందిన వారిలో ఎవరైనా నేర స్వభావం కలిగి ఉన్నారా? నేర చరిత్ర ఉందా అనే విషయాలు తెలుసుకోకుండా పాసులు జారిచేస్తుండటాన్ని నిఘా సంస్థలు ప్రశ్నిస్తున్నాయి. దీంతో ప్రధాన కంపెనీలకు పోలీసులు లేఖలు పంపి పీవీసీ పక్కాగా జరిగేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**లేఖలు జారీచేశాం.**

ఇటీవల పహల్గాం ఉగ్రదాడి అనంతరం చోటుచేసుకున్న పరిణామాల దృష్ట్యా నగర పౌరులతో పాటు ప్రముఖ సంస్థల భద్రతకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వచ్చే వారికి పాసుల జారీలో పారదర్శకత పాటిస్తున్నాం. పీవీసీ కచ్చితంగా అమలు చేస్తాం. ఇప్పటికే కంపెనీలకు లేఖలు జారీచేశాం. గొలగాని అప్పారావు, సీఐ-మల్కాపురం

# కలవారికి కాదు.. కలలుగనే మధ్యతరగతికి!!



విశాఖపట్నం: విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మధ్యతరగతి ప్రజలకు అపార్ట్‌మెంట్లు నిర్మించడానికి ప్రణాళిక చేస్తోంది. వాటిని నగరం నడిబొడ్డున నిర్మించాలనుకుంటోంది. ఇందుకు డిమాండు సర్వే చేస్తోంది. ప్రజాభిప్రాయం ఆధారంగా ముందుకు వెళ్లనున్నారు. మిథిలాపురి కాలనీ, మారికవలస, మధురవాడ శ్రీకన్య, వేపగుంటలో నిర్మించాలన్నది ప్రణాళిక. ప్రస్తుతం విశాఖ నగరం మధ్యలో మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో ఫ్లాట్లు కొనుగోలు చేయడం కలగా మిగిలింది. డిమాండున్నప్పటికీ దొరకని పరిస్థితి. ఈ నేపథ్యంలో వీఎంఆర్‌డీఏకు నగరంలో ఖాళీగా ఉన్న స్థలాలను ఆదాయ వనరుగా మార్చాలనుకున్నారు. ఆయా ప్రాంతాల్లో బహుళ అంతస్తులు నిర్మిస్తే అటు ప్రజలకు ఉపయోగపడడంతో పాటు వీఎంఆర్‌డీఏకు రెవెన్యూ వస్తుందని భావిస్తున్నారు. సర్వేలో వ్యక్తిగత, కుటుంబ సభ్యుల వివరాలను పేర్కొనాలి. అలాగే ఆదాయం, విశాఖలో ఉంటున్నారా, స్థానికేతరులా, స్థానికేతరులైతే ఎక్కడ అనేవీ నమోదు చేయాలి. కొత్త ఫ్లాటు కొనాలనుకుంటుంటే సూచించిన పేర్లలో నచ్చింది ఎంపిక చేయాలి. కొత్త ఫ్లాట్ ఆరు నెలల్లో కొంటారా, ఏడాదిలో కొంటారా అనేది తెలపాలి. రెండు పడకలా, మూడు పడకలా, ఏ అంతస్తులో కొనాలనుకుంటున్నారో కూడా పొందుపరచాలి.

887, 945 చదరపు అడుగులతో రెండు పడక గదుల ఫ్లాట్లు, 1,238, 1,294 చ.అడుగుల ఫ్లాట్లు, 1,458 చ.అడుగుల ఫ్లాట్లు నిర్మించాలనుకుంటున్నారు.

ధర ఎంతలో ఉండాలనేదీ సర్వేలో పేర్కొన్నారు. రూ.45 లక్షల వరకు, రూ.45 లక్షల నుంచి రూ.55 లక్షల వరకు, రూ.56 లక్షల నుంచి రూ.65 లక్షల వరకు, రూ.65 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు, రూ.75 లక్షల పైన ఉండాలా అనే వివరాలు ఆరా తీస్తున్నారు.

క్లబ్‌హౌస్, పార్కులు, లిఫ్టులు, నడక మార్గం, గ్యాస్ లైన్, సీసీటీవీ ఇతర సౌకర్యాలలో ఏవేవి కల్పించాలో సర్వేలో అడిగారు. ఇప్పటికే ఇందులో వేలమంది పాల్గొని వారి అభిప్రాయాలు తెలియజేస్తున్నారు. అధికారులు వాటన్నింటినీ క్రోడీకరిస్తున్నారు. వాటి ఆధారంగా ఎక్కడ ఏవిధంగా నిర్మించాలో అంచనాలు తయారు చేస్తున్నారు.

డిమాండు సర్వే: నగరంలో ప్రజలు ఎక్కడ కొనుగోలు చేస్తారు, ఎన్ని చదరపు అడుగుల్లోని ఫ్లాట్లు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు వంటి వివరాలు తెలుసుకునేందుకు డిమాండు సర్వే సాగిస్తున్నారు. ఈ వివరాలు పొందుపరిచిన వివరాల క్యూఆర్ కోడ్‌ను నగరంలో అనేక చోట్ల ఏర్పాటు చేశారు. స్కాన్ చేసి ప్రజలు వారి అభిప్రాయం తెలిపేలా వాటిని ఉంచారు. అందులో సలహాలు, మెరుగైన నిర్మాణాల గురించి తెలిపేందుకు కూడా అవకాశం కల్పించారు.

రెండు చోట్ల: ఎంపిక చేసిన అన్ని చోట్ల అపార్ట్‌మెంట్లు నిర్మించాలని మొదట భావించినప్పటికీ అవి పూర్తయ్యేసరికి ఆలస్యమవుతుందని రెండు చోట్ల తొలుత చేపట్టాలనుకుంటున్నారు. నాలుగు చోట్ల ప్రారంభించి నెమ్మదిగా పూర్తిచేయడం కన్నా రెండు చోట్ల గడువులోగా పూర్తయ్యేలా చేస్తే బాగుంటుందనేది ఆలోచన. ఈ నేపథ్యంలో వేపగుంట, మధురవాడలో ఒక్కొక్కటి నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు కమిషనర్ విశ్వనాథన్ పేర్కొన్నారు.

# జైకా.. పనులు సాగక!



చిత్తూరు: వైకాపా హయాంలో సాగునీటి ప్రాజెక్టులను గాలికొదిలేశారు. ఆ పార్టీ నేతల జేబులు నింపుకొనే పనులు ప్రాధాన్య జాబితాలో చేర్చడం తప్ప సాధించిన పురోగతి శూన్యం. జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ (జైకా) నుంచి నిధులు వచ్చే అవకాశం ఉన్నా నిర్లక్ష్యం చూపారు. దీంతో కీలకమైన జలాశయాలు, చెరువుల మరమ్మతులకు గ్రహణం పట్టుకుంది. నెల రోజుల్లో జైకా ప్రాజెక్టు గడువు ముగుస్తుంది. 2014-19లో తెదేపా అధికారంలో ఉన్న సమయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 65 చెరువులు, పిచ్చాటూరు మండలం అరణియార్, కార్వేటినగరం మండలం కృష్ణాపురం రిజర్వాయర్ల ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. తద్వారా 24,034.56 ఎకరాలకు సాగునీరందుతుందని భావించారు. తెదేపా పాలన చివర్లో జైకా నిధులు మంజూరయ్యాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా వీటిని పట్టించుకోలేదు. అరణియార్, కృష్ణాపురం జలాశయాలకు తొలుత ఒప్పందం చేసుకున్న గుత్తేదారు చురుగ్గా పనులు చేశారు. బిల్లులు రాకపోవడంతో అర్ధాంతరంగా నిలిపేశారు. ఇలా అరణియార్‌కు రూ.35 కోట్లు, కృష్ణాపురానికి రూ.28 కోట్లు మంజూరైనా ఫలితం లేకుండా పోయింది.

**ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటేనే..** కూటమి ప్రభుత్వం వచ్చాక జైకా పనుల పురోగతిపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో అసలు ప్రారంభించని 17 చెరువుల పనులు రద్దు చేశారు. 38 పనులు పురోగతిలో ఉండగా పూర్తి చేసేందుకు నెలాఖరు వరకు గడువు ఉంది. చిత్తూరు, గంగాధరనెల్లూరు, పెనుమూరు, ఐరాల మండలాల్లోనే కొంతవరకు పూర్తయ్యాయి. ఈ క్రమంలోనే ఓ కొలిక్కి వచ్చిన చెరువులకు సంబంధించిన నిర్మాణాలు మాత్రం వేగవంతం చేయాలని జలవనరుల శాఖ అధికారులు ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని కనీసం మరో రెండేళ్లు గడువు పెంచితేనే పనులు పూర్తవుతాయి.

**సీఎఫ్‌ఎంఎస్‌లో రూ.3 కోట్లు పెండింగ్**

మరోవైపు కృష్ణాపురం, అరణియార్ ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులు విడుదలవ్వాలి. దాదాపు రూ.3 కోట్ల బకాయిలు ఉన్నాయని జలవనరుల శాఖ అధికారులు నివేదించారు. ఇవి విడుదల చేస్తే గుత్తేదారులకు ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు.

జైకా నిధులతో ఆధునికీకరించే చెరువులు: 65

ఆయకట్టు: 24,034.56

ఎకరాలురద్దు చేసిన పనులు: 17

పూర్తయినవి: 10ప్రభుత్వ ఆదేశాల కోసం వేచి చూస్తున్నాం

జైకా నిధులతో చేపట్టిన చెరువులు, రిజర్వాయర్ల పనులు పూర్తి చేసేందుకు మరికొంత సమయం అవసరం. గడువు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరాం. వచ్చే ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం.వెంకటేశ్వరరాజు, ఎస్ఈ, జలవనరుల శాఖ

# దున్నేద్దాం.. విత్తు వేసేద్దాం

విజయనగరం : ఈ ఏడాది ముందస్తుగా కురుస్తున్న వానలు ఖరీఫ్‌కు శుభారంభం పలికాయి. రైతులు వ్యవసాయ పనులకు సిద్ధం అవుతున్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరగనుంది. దీనికి అనుగుణంగా వ్యవసాయ శాఖాధికారులు విత్తనాలు సిద్ధం చేశారు.

విజయనగరం జిల్లాలో లక్ష హెక్టార్లు, మన్యం జిల్లాలో 72 వేల హెక్టార్లలో వరి సాగు అవుతుందని అంచనా వేశారు. విజయనగరానికి 50 వేల క్వింటాళ్లు, మన్యానికి 35 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం. విజయనగరంలో 16,952 క్వింటాళ్ల విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో సిద్ధం చేశారు. క్వింటా రూ.300 రాయితీపై రూ.వెయ్యికి రైతులకు అందజేస్తారు. ఎకరానికి 20 కిలోల చొప్పున గరిష్ఠంగా ఒక్కొక్కరికీ క్వింటా ఇస్తారు. మన్యం జిల్లాలో 26,470 క్వింటాళ్ల వరి విత్తనాలు రాయితీపై సరఫరా చేస్తారు. ఇందులో గిరిజనులకు 9,092 క్వింటాళు 90 శాతం, మిగిలిన 17,378 క్వింటాళ్లు రూ.300 రాయితీపై పంపిణీ చేస్తారు.

**తొలి వారంలో నారు పోత**

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువులు, ఇతర జల వనరుల్లోకి నీరు చేరుతోంది. వీటి ఆధారంగా జూన్ తొలి వారంలో వరి నారుమళ్లలో విత్తనాలు చల్లుతారు. 25-30 రోజుల్లో వరి నారు సిద్ధమైన తర్వాత జులై తొలి వారం నుంచి నాట్లు ప్రారంభిస్తారు.



విజయనగరం జిల్లాలో 1121 రకం విత్తనాలు, మన్యం జిల్లాలో ఎంటీయూ 1064, ఆర్‌జీఎల్ 2537 రకాల విత్తనాలు అత్యధికంగా వినియోగిస్తారు. ఈ రకాలన్నీ 135 నుంచి 140 రోజుల్లో పండుతుంది. వాతావరణం కలిసొచ్చి, ప్రకృతి కరుణిస్తే ఈ ఏడాది అక్టోబరు తొలి పక్షానికి పంట రైతుల చేతికి అందుతుంది.

**వెద సాగుకు ప్రాధాన్యం**

విజయనగరం జిల్లాలో సుమారు 5 వేల హెక్టార్లు, మన్యం జిల్లాలో సుమారు 12 వేల హెక్టార్ల వరకు వెద విధానంలో వరి పండిస్తారు. సకాలంలో కలుపు తొలగించకపోతే పంట ఉత్పత్తి పడిపోతుంది. రైతులకు తీవ్ర నష్టం కలుగుతుంది. ఈ కారణంగా అత్యధిక విస్తీర్ణంలో రైతులు వరి నాట్లు వేస్తారు.

**ప్రణాళిక ప్రకారం ముందుకు**

సాధారణ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించిన ఖరీఫ్ సాగు ప్రణాళిక అమలుకు యంత్రాంగం సిద్ధంగా ఉంది. విత్తనాలతో పాటు ఎరువులు సిద్ధం చేశాం. విత్తనాల కొనుగోళ్లు పూర్తయిన తర్వాత రైతు సేవా కేంద్రాల్లోని గిడ్డంగులకు ఎరువులు పంపిస్తాం. ప్రస్తుతం వసతి ఉన్న ఆర్‌ఎస్‌కేలకు విత్తనాలతో పాటు ఎరువులు చేరవేస్తున్నాం. ఖరీఫ్‌లో మన్యం జిల్లాలో కాస్త భిన్నంగా పంటల సాగు ఉంటుంది. వరి సహా రాగులు, కొర్రలు, సామ, పెసర, మినుము, కందులు, వేరుసెనగ, పొద్దుతిరుగుడు వంటి మెట్ట పంటలు పండిస్తారు. 15 వేల ఎకరాల్లో చిరుధాన్యాల సాగుకు ప్రణాళిక రూపొందించారు. 30 వేల ఎకరాల్లో వరి పండించే పొలాల గట్లపై కంది సాగు చేయాలని నిర్ణయించారు. గత నెలలో రైతులకు విత్తనాలు సరఫరా చేశారు. చిరుధాన్యాల విత్తనాలు రాయితీపై త్వరలో పంపిణీ చేస్తాం.

వి.టి.రామారావు, రాబర్ట్‌పాల్, జిల్లాల వ్యవసాయాధికారులు

# ధైర్యమే.. పునర్జన్మ

విజయనగరం :పార్వతీపురానికి చెందిన నాలుగేళ్ల చిన్నారికి క్యాన్సర్ ఉందని వైద్యులు తేల్చారు. దీంతో తల్లిదండ్రులు కొన్నాళ్లపాటు కాకినాడ మకాం మార్చి.. బిడ్డకు చికిత్స అందించగా క్యాన్సర్‌ను జయించింది. నాలుగేళ్లుగా ఇబ్బంది లేకుండా చక్కగా చదువుకుంటోంది. భయపడకుండా క్రమం తప్పకుండా మందులు వాడితే నయం అవుతుందని ఆ తల్లిదండ్రులు అంటున్నారు.

బెలగాం ప్రాంతానికి చెందిన ఓ గృహిణి 25 ఏళ్ల క్రితం క్యాన్సర్ బారినపడ్డారు. మనోధైర్యంతో వైద్యుల సూచన మేరకు మందులు వాడుతూ.. మంచి ఆహారం తీసుకోవడంతో పూర్తిగా నయం చేసుకోగలిగారు.క్యాన్సర్ అనే పదం చెవిలో పడగానే వణుకు మొదలవుతుంది. ఈ మహమ్మారి బారిన పడితే ప్రాణాంతకమని భయం. కానీ ఆరోగ్యంపై కాస్త శ్రద్ధ, కొంచెం అవగాహన ఉంటే ప్రాథమిక దశలోనే గుర్తించొచ్చు. సరైన చికిత్సతో జయించి.. ఆత్మీయులతో ఆనందంగా జీవించొచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. నేడు 'క్యాన్సర్ సర్వైవర్స్ డే' సందర్భంగా ప్రత్యేక కథనం.

శరీరంలోని మార్పుల్ని గమనిస్తూ.. ఆరంభ దశలోనే గుర్తిస్తే మందులు మరింత ప్రభావంతంగా పనిచేసి, వ్యాధి నయం అవుతుందని వైద్యులు చెబుతున్నారు. క్యాన్సర్‌ను జయించి, బయట పడిన రోగులు చాలా మందే ఉన్నారు. కేవలం సీబీసీ రక్త పరీక్ష ద్వారా చాలా వరకు క్యాన్సర్ లక్షణాలను పట్టేయొచ్చు. విజయనగరం మహారాజా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఇందుకు సంబంధించిన విభాగం 2024 అక్టోబరులో ఏర్పాటైంది. ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తించి, అవసరమైన చికిత్స అందేలా చూస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో నెలకు 20 నుంచి 25 మంది వరకు మహిళలు గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ బారినపడుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. పార్వతీపురం జిల్లాలో ఎన్‌సీడీ సర్వేలో 5,34,057 మందిని పరీక్షించగా అనుమానిత క్యాన్సర్ కేసులు 4,237, నిర్ధారణ అయినవి 335 ఉన్నట్లు వైద్యులు గుర్తించారు.

**అమ్మాయిలూ.. టీకా వేసుకున్నారా?**

గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్లు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఇది ఇన్‌ఫెక్షన్ల వల్ల సోకుతుంది. ఇందులో హెచ్‌పీవీ వైరస్ వల్ల సోకే వ్యాధికి టీకా ఉంది. 9-24 ఏళ్లలోపు పెళ్లి కాని అమ్మాయిలు వేసుకోవడం వల్ల క్యాన్సర్ బారిన పడే అవకాశం చాలా తక్కువ. విజయనగరం సర్వజన ఆసుపత్రికి చేరుకుని, వైద్యుల్ని సంప్రదిస్తే వ్యాక్సిన్ వేస్తారు.

**లక్షణాలు** అతిగా బరువు తగ్గిపోవడం, బాగా జుట్టు ఊడటం, జ్వరం, అలసట, శరీరం ఎర్రగా, నల్లగా మారి, దురద రావడం, కళ్లు పసుపుగా మారడం, మూత్రాశయ తీరులో మార్పులు, గాయాలు మానకపోవడం, మలం నుంచి రక్తస్రావం, మింగడం కష్టమవ్వడం, విపరీతమైన దగ్గు. **వీటికి దూరంగా..** మద్యపానం, ధూమపానం, కృత్రిమ రంగులు, నిల్వ పదార్థాలు, ప్లాస్టిక్ పాత్రలు, కలుషితమైన వాతావరణం.

ఎన్టీఆర్ వైద్య సేవలో ఉచితం: ఎన్టీఆర్ వైద్య సేవలో ఉచితంగా చికిత్స అందుతుంది. విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రిలో మొదటి, రెండో దశల్లో క్యాన్సర్ ఉంటే శస్త్రచికిత్సతో నియంత్రిస్తాం. మూడు, నాలుగు దశల్లో ఉంటే రేడియో థెరపీ, కీమోథెరపీ అవసరం.

# కదిరి మల్లెల గుబాళింపు

కదిరి : పరిమళాలు గుబాళించే మల్లెలంటే మహిళలకు మక్కువ. అందులో కదిరి మల్లెలంటే మరింతగా ఇష్టపడతారు. సువాసన, అలంకరణలో ప్రత్యేక ఆకర్షణ కదిరి మల్లెల సొంతం. అందుకే అతివలు ధర ఎంతైనా వెనుకాడకుండా కొనుగోలు చేస్తారు. శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా వందల ఎకరాల్లో కదిరి మల్లెల సాగులో ఉన్నాయి. ప్రధానంగా బుక్కపట్నం మండలం అగ్రహారం, పాముదుర్తిల్లో 49 ఎకరాలు, కదిరి ప్రాంతంలో 20 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో సుమారు 200 మంది రైతులు మల్లెతోటల సాగు చేపట్టారు.



రోజుకు రెండున్నర టన్నుల దిగుబడి సాధిస్తున్నారు. ధర్మవరం, అనంతపురం, మదనపల్లి తదితర పట్టణాల్లోని మార్కెట్లకు తరలిస్తున్నారు. కిలో రూ.200 పలుకుతోంది. మాలలుగా అల్లితే ఒక్కోటి రూ.500కు పైగా అమ్ముతున్నారు. వివాహాలు, పండగల సీజన్‌లో కిలో రూ.1000కి తగ్గదు. గతంలో చెన్నై, బెంగళూరు నగరాలకు ఎగుమతి అయ్యేవి.

**మగువలకు పండగే..**

వేసవిలో మగువలకు మల్లెపూల పండగే. పెళ్లిళ్లు, పండుగలు, ఇతర శుభకార్యాల్లో మహిళలు పూల అలంకరణ చేసుకుంటారు. పూలజడ, కొప్పుల జడ వంటివి అల్లుతారు. ఇక పెళ్లిళ్లలో పూల వాలుజడ తప్పనిసరి. అట్టముక్కపై పూలు కుట్టి వాలుజడను అమర్చుతారు. కురుల మధ్య పూలను పెట్టి అల్లటంతో వాలుజడను అలంకరిస్తారు.

# జలవనరుల శాఖలో ఖాళీల వెక్కిరింత!

రాజమహేంద్రవరం: ఉభయ గోదావరి జిల్లాలకు అత్యంత కీలకమైన జలవనరుల శాఖలో కీలకమైన పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. అదనపు బాధ్యతలతో అధికారులు రెండేసి చోట్ల విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. వైకాపా ప్రభుత్వ హయాంలో గత అయిదేళ్లలో ఈ రంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురవగా.. కూటమి ప్రభుత్వమైనా చక్కదిద్దాలని రైతులంతా కోరుతున్నారు. అనేకమంది అధికారులు క్షేత్రస్థాయి బాధ్యతల కంటే పైరవీలు చేసి నాణ్యతా పరిశీలన విభాగంలో పనిచేసేందుకే ఆసక్తి చూపుతున్న పరిస్థితి. వచ్చేది వరదల కాలం. కీలకమైన ధవళేశ్వరం



బ్యారేజీ నిర్వహణ, పర్యవేక్షణకు 261 మంది అధికారులు, సిబ్బంది అవసరం కాగా కేవలం 20 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో నలుగురు ఆగస్టులోగా ఉద్యోగ విరమణ చేస్తారు. వరదల సమయంలో కనీసం 50 శాతం మంది విశ్రాంత ఉద్యోగుల నియామకానికి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.

**ఈఈలు ఇద్దరే..** ఉమ్మడి జిల్లాలో తూర్పు, మధ్య డెల్టాతోపాటు హెడ్‌వర్క్స్, డ్రెయినేజీ, ఏలేరు ప్రాజెక్టు, ఏలేరు డివిజన్, ఎస్ఎంఎల్ ప్రాజెక్టులున్నాయి. కార్యనిర్వాహక ఇంజినీర్ల (ఈఈ) మెజార్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏడుగురు ఈఈలకు ఇద్దరు ఉండగా, అయిదుగురు అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) నిర్వర్తిస్తున్నారు. 25 మంది డిప్యూటీ ఇంజినీర్లకు 19 మంది ఉన్నారు. రెండు డివిజన్లలో ఎఫ్ఏసీలు బాధ్యతల్లో ఉన్నారు. ఏఈఈ స్థాయి పోస్టుల్లోనూ ఖాళీలు వెక్కిరిస్తున్నాయి.

# పచ్చి కొబ్బరికాయకు డిమాండ్

అంబాజీపేట: తమిళనాడు, కేరళ, కర్ణాటకలో కొబ్బరి కాయల దిగుబడి తగ్గడంతో కోనసీమ మార్కెట్ పుంజుకుంది. టన్నుకు ఎక్కువ కాయలు తూగుతుండటంతో కోనసీమ పచ్చికొబ్బరి కాయలకు డిమాండ్ ఏర్పడింది. ఇక్కడ కాయలు లెక్కన టోకున కొని ఇతర రాష్ట్రాల్లో టన్నుల లెక్కన విక్రయిస్తున్నారు. టన్నుకు సుమారు 3000 కాయలు వరకు తూగుతాయి. అక్కడ చిల్లర వ్యాపారులు కిలోల లెక్కన తూకం చేసి అమ్ముతుంటారు. ఇతర రాష్ట్రాల్లో కాయలు పెద్ద పరిమాణంలో ఉండటంతో కిలోకు రెండు, మూడు వస్తుండగా



ఆంధ్రప్రదేశ్ నుంచి కొనుగోలు చేసిన కాయలు నాలుగు వరకు తూగుతున్నాయి. ప్రస్తుతం సీజన్ కాకపోయినప్పటికీ ఇక్కడ వెయ్యి పచ్చి కొబ్బరి కాయల ధర రూ. 17 వేల నుంచి రూ. 17,500 వరకు పలుకుతోందని కొబ్బరి మార్కెట్ విశ్లేషకుడు పరసా సత్తిబాబు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. నిన్న మొన్నటి వరకూ వెయ్యి కొబ్బరికాయలు రూ.14 వేల నుంచి రూ.16 వేల వరకు ధర ఉంది. చిన్నకాయలకు డిమాండు ఉండటంతో కొరత ఏర్పడిందని అంటున్నారు. రైతుల నుంచి కాయలను కొనుగోలు చేసి తరలించేందుకు ట్రక్కర్ల సమస్య కూడా ఉందంటున్నారు.

# కుటీర పరిశ్రమల ఏర్పాటు.. ఉపాధికి తోడ్పాటు



మడకశిర : కరోనా అనంతరం చాలా రంగాలు కుదేలయ్యాయి. వివిధ రంగాల్లో ఉపాధి కోల్పోయిన వారు ఇతర ఆదాయ మార్గాలను ఎంచుకుంటూ కొంతమంది యువత, మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. విభిన్నమైన కుటీర పరిశ్రమలు నెలకొల్పి స్వయంగా తయారీ, మార్కెటింగ్ వంటివి చేస్తున్నారు. మడకశిర నియోజకవర్గంలో పలువురు స్థానికంగానే కాకుండా బెంగళూరు, తుమకూరులోనూ చిన్నచిన్న పరిశ్రమలు స్థాపించుకుని నెలనెలా మంచి ఆదాయాన్ని పొందుతున్నారు.

**రోజుకు 4 గంటలు.. నెలకు రూ.35 వేల ఆదాయం**

చంద్రకళ భర్త కోదండరామిరెడ్డితో కలిసి గతంలో పాలు కొనుగోలు ప్యాకెట్లు తయారు చేసే పరిశ్రమలను స్థాపించారు. మార్కెట్లో పోటీ ఎక్కువ కావడంతో గిట్టుబాటు కాక నష్టపోయారు. కుంగిపోకుండా పాల డెయిరీని ఏర్పాటు చేసుకున్నారు. అలుపనపల్లి గ్రామ చుట్టుపక్కల గ్రామాల నుంచి పాడి రైతులు రోజూ రెండు పూటలా పాలను తీసుకొచ్చి ఈ డెయిరీలో పోస్తుంటారు. రోజూ దాదాపుగా 1200 లీటర్ల పాలను సేకరించి మడకశిరలోని విజయ డెయిరీకి సరఫరా చేస్తున్నారు. కమీషన్ ద్వారా రూ.1200 వచ్చేలా ప్రణాళిక చేసుకున్నారు. నెలకు రూ.35వేల వరకు ఎలాంటి ఖర్చులు లేకుండా నికర ఆదాయాన్ని సంపాదిస్తున్నారు.

**పనికిరాని వక్క పట్టలతో ..**

అమరాపురం మండలం గౌడనకుంట గ్రామంలో ఆనంద్‌కుమార్ రోజూ కూలీగా వక్కను కోసేందుకు వెళ్లేవాడు. తోటలో నేలరాలి వృథాగా పడి ఉన్న ఆకులతో ప్లేట్ల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు సంకల్పించుకున్నాడు. దీంతో పలువురితో విచారించుకుని రూ.5లక్షలు పెట్టుబడిగా పెట్టి 2019లో తమిళనాడు నుంచి యంత్రాలు తీసుకొచ్చి చిన్న పరిశ్రమ ఏర్పాటు చేసుకున్నాడు. కుటుంబ సభ్యులతో పాటు మరో 5మంది ఇందులో పనిచేస్తుంటారు. వక్క ఆకులను నిల్వ చేసుకుని రోజూ వెయ్యి ప్లేట్లు తయారు చేస్తాడు. సగటున ఒక ప్లేటును రూ.3కు విక్రయించి ప్రతి నెలా దాదాపు రూ.లక్ష వరకు వస్తుండగా కూలీ ఖర్చులు పోనూ రూ.60వేలు, ఏడాదికి రూ.7లక్షల వరకు ఆదాయాన్ని ఆర్జిస్తున్నాడు. తయారు చేసిన వక్క ప్లేట్లు స్థానికంగానే కాకుండా బెంగళూరు, తుమకూరు, విజయవాడ, గుంటూరు, తమిళనాడుకు ఎగుమతి చేస్తారు.

**పది మందికి ఉపాధి..**

స్వయం సహాయక సభ్యురాలిగా చేరి సంఘంలో రుణం తీసుకుని చిరుతిళ్ల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసుకుంది. బ్యాంకు ద్వారా రూ.2లక్షలు రుణం తీసుకుని పదేళ్లుగా చిరుతిళ్ల తయారీ, స్వయంగా మార్కెటింగ్ చేసుకుంటోంది. నెలకు రూ.70వేలు ఆదాయం సంపాదిస్తూ మరో 10మందికి ఉపాధి కల్పిస్తోంది. సంఘంలో తీసుకున్న రుణాన్ని వృథా చేయకుండా ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ఈ పరిశ్రమ స్థాపించి బాగా స్థిరపడ్డారు. రాజమ్మ, స్వయం సహాయక సభ్యురాలు, మడకశిర

# పోలీసుకు తోడుగా కృత్రిమ మేధ




అనంతపురం: కేసుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో వాటికి సంబంధించిన నివేదికలు రూపొందించడం పోలీసులకు భారంగా మారుతోంది. ఛార్జిషీటు దాఖలు, కోర్టులకు నివేదికల సమర్పణ.. కత్తిమీద సాములా మారాయి. పని ఒత్తిడితో నేర విచారణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో అనంతపురం జిల్లా పోలీసులు సాంకేతికతను అందిపుచ్చుకుని ముందుకెళ్తున్నారు. ఫిర్యాదుల నమోదు, నేర విచారణకు సంబంధించిన నివేదికల తయారీలో కృత్రిమ మేధ (ఏఐ)ను సమర్థవంతంగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఏఐ టూల్స్‌ను తమకు కావాల్సిన రీతిలో ఉపయోగించుకుంటూ నేర విచారణలో వేగం పెంచుతున్నారు. గతంతో పోలిస్తే కేసుల డ్రాఫ్టింగ్‌లో తప్పులు 90 శాతానికి పైగా తగ్గడంతో పాటు కచ్చితత్వం పెరిగినట్లు చెబుతున్నారు. సమయం ఆదాతో పాటు మంచి ఫలితాలు వస్తుండటంతో కిందిస్థాయి సిబ్బందికి ఏఐపై అవగాహన కల్పిస్తున్నారు.

**సెక్షన్లు చెప్పేస్తోంది**

ఫిర్యాదులో పేర్కొన్న అంశాల ఆధారంగా ఏయే సెక్షన్లను పొందుపరచాలో ఏఐ సూచిస్తోంది. విచారణ తీరు, ఆధారాల సేకరణ వివరాలను ఒక క్రమపద్ధతిలో సూచిస్తుంది. తద్వారా విచారణ వేగవంతంగా చేసేందుకు వీలవుతుందని పోలీసులు చెబుతున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన నిందితుల విచారణ సమయంలో భాషానువాదం సమస్య లేకుండా పూర్తి కచ్చితత్వంతో అవగాహన కలిగేలా పోలీసులకు సహకారం అందిస్తుంది.

**తప్పులను ఎత్తి చూపుతూ..**

ఎఫ్ఐఆర్ నమోదు తర్వాత ఏ కోణంలో విచారించాలో ఏఐ సూచిస్తోంది. విచారణ అనంతరం పోలీసులు దాఖలు చేసే ఛార్జిషీటు ఏఐ పరిశీలించి తగిన సూచనలు చేస్తుంది. ఛార్జిషీటులో దొర్లిన తప్పులను ఎత్తి చూపడంతో పాటు అదనపు సమాచారం అవసరమైతే.. పొందుపరచాలని చెబుతుంది. కోర్టులో వాదనల సమయంలో ఎలాంటి అంశాలు ప్రస్తావించాలి? డిఫెన్స్ లాయర్ నుంచి ఎలాంటి ప్రశ్నలు ఎదురుకావచ్చు? తదితర అంశాలను ముందుగానే అంచనా వేస్తుంది. సమర్థవంతంగా వాదనలు వినిపించేందుకు ఎలా సిద్ధం కావాలో సూచిస్తుంది. కోర్టులో ఏ సందర్భాల్లో ఎలా నడుచుకోవాలో చెబుతుంది.

**చెబితే రాసేస్తుంది..**

ఫిర్యాదుల నమోదుకు సంబంధించి బాధితులు చెప్పే విషయాలను రాసుకోవడం.. కంప్యూటర్‌లో నమోదు ప్రక్రియ కొన్ని సందర్భాల్లో కష్టంగా మారుతోంది. దీన్ని సులభతరం చేయడానికి ఏఐ విధానంలో బాధితులు సమస్యలు చెబుతుంటే అక్కడికక్కడే రికార్డ్ చేసి.. ఫిర్యాదును సిద్ధం చేస్తుంది. అక్షర జ్ఞానం లేనివారు, వృద్ధులు, ఫిర్యాదులు రాయలేని వారికి ఎక్కువగా ఉపయోగపడుతుంది. ఈ విధానంలో ప్రయోగాత్మకంగా ఇప్పటివరకు 54 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.

**సమయం ఆదాతోపాటు కచ్చితత్వం**

జగదీశ్, జిల్లా ఎస్పీ, అనంతపురం

నేర విచారణలో ఏఐను వినియోగించడంతో సమయం ఆదా అవుతోంది. నివేదికల తయారీలో వేగంతో పాటు కచ్చితత్వం పెరుగుతుంది. తద్వారా శిక్షల శాతం పెంచేందుకు ఏఐ ఉపయోగపడుతోంది. ప్రస్తుతం జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లో నూతన సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తున్నారు. త్వరలోనే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు నమోదు చేసేందుకు ఏఐను వినియోగిస్తాం.

# పంచాయతీలో అవినీతి రాజ్

ఒంగోలు : పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి(పీఆర్ ఆర్డీ) శాఖ.. గత ప్రభుత్వంలో వైకాపా నేతల జేబు సంస్థగా మారింది. అప్పట్లో కొన్ని గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలను ఇష్టారీతిన నిర్మించినా అడ్డుకోలేదు. నిబంధనలకు నీళ్లొదిలినా కిమ్మనలేదు. ఇసుకను అమ్మేసుకున్నా పట్టించుకోలేదు. తీరా విచారించి చర్యలు చేపట్టాలని ఇప్పుడు ఆదేశిస్తున్నా.. ఇంకా కదలడం లేదు.

**వై.పాలెంలో**

గత ప్రభుత్వంలో వైకాపా నేతలు రెచ్చిపోయారు. వై.పాలెం సబ్ డివిజన్ పరిధిలో ప్రభుత్వ పనులకు కేటాయించిన ఇసుకను ఇష్టారాజ్యంగా దారి మళ్లించి అమ్మేసుకున్నారు. రూ.65 లక్షల విలువైన 17,333 మెట్రిక్ టన్నుల ఇసుకను దుర్వినియోగం చేసినట్లు విజిలెన్స్ అధికారులు రెండేళ్ల క్రితమే తేల్చారు. దీంతో కూటమి ప్రభుత్వం స్పందించింది. అప్పటి డీఈఈ జి.రతన్‌బాబు(ప్రస్తుత ఒంగోలు పీఐయూ ఈఈ), త్రిపురాంతకం మండల సైట్ ఇంజినీర్ ఎన్.వెంకటేశ్వర్లు, వై.పాలెం ఏఈ పి.మహంకాళయ్య, పుల్లలచెరువు ఏఈ టి.నాగప్పలపై విచారణకు ఆదేశిస్తూ గత నెల 20న ఉత్తర్వులు జారీ చేసింది.

**కొండపిలో కొల్లగొట్టారు** కొండపి నియోజకవర్గంలోని గుండ్లసముద్రం నుంచి చిలంకూరు మధ్య ఐదు వంతెనలు నిర్మించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. నిర్మాణ పనుల్లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు నిర్ధారించి 2024 జులై 22న నివేదిక సమర్పించారు. బాధ్యులైన అప్పటి సింగరాయకొండ ఏఈఈ సి.శ్రీధర్‌రెడ్డితో పాటు డీఈఈ(పీఐయూ ఎస్డీ) జి.గంగయ్య, ఈఈ(పీఐయూ ఒంగోలు) వి.మారుతీరాంపై చర్యలు తీసుకోవాలని, మూడు గుత్తేదారుల సంస్థల నుంచి రూ.2.96 లక్షలు రికవరీ చేయాలని సిఫార్సు చేశారు. ఆ మేరకు గత నెలలో ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు.

**ప్చ్.. ఆదేశించినా కదలిక లేదు**

రోడ్లు, భవనాల శాఖ కార్యాలయ ఖర్చుల నిమిత్తం సర్కారు విడుదల చేసిన రూ.21.29 లక్షలకు లెక్కలు సరిగా లేవని అకౌంటెంట్ జనరల్ ఆఫీస్(ఏజీ) ఆడిట్ అధికారులు గుర్తించారు. మెమోలు జారీ చేసినా లెక్కలు సమర్పించని సంబంధిత సీనియర్ అసిస్టెంట్‌పై క్రిమినల్ చర్యలకు ఆదేశించారు. అయినా పంచాయతీ రాజ్ శాఖలో మాత్రం ఎలాంటి కదలిక లేదు. అక్రమాలు గుర్తించిన వెంటనే ఉన్నతాధికారులు విచారణ పేరిట చర్యలు తీసుకోకుండా జాప్యం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్కారు సొమ్ము దుర్వినియోగం చేసిన వారిపై పక్కా చర్యలు తీసుకుంటేనే అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పీఆర్‌ఆర్డీ ఎస్ఈ నిశాంత్ హుస్సేన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక్కొక్కటిగా విచారణ చేస్తున్నామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# మామిడి.. మిగలని దమ్మిడి

పాకాల : మామిడి రైతుల బతుకులు వీధిన పడుతున్నాయి. కాయలను అడిగేవారు లేక, గిట్టుబాటు ధరలు దక్కక, ఆదాయం రాక, అప్పులు తీర్చలేని దుస్థితి వారిని మరింత కష్టాల్లోకి నెడుతోంది. సీజన్ సగం ముగుస్తున్నా గుజ్జు పరిశ్రమలు దాష్టీకాన్ని ప్రదర్శిస్తున్నాయి. మండీల్లో ఎటుచూసినా కాయలతో నిండిపోవడంతో ఇక వద్దంటూ పంటను తీసుకోవడం లేదు. దీంతో ఇప్పటికీ తోటల్లో ఉన్న పంటను కోసి అమ్ముకోలేని దారుణ పరిస్థితులు కొనసాగుతున్నాయి. మామిడిని నమ్ముకున్న చిరు వ్యాపారులు సైతం ఏళ్లుగా కూడబెట్టుకున్న సొమ్ము పోయి రోడ్డున పడుతున్నారు.

**పదిహేను ఎకరాల తోట.. పెట్టుబడీ రాక**

దామలచెరువు పంచాయతీ నల్లానివారిపల్లికి చెందిన రైతు నారా బాబునాయుడు కుటుంబానికి సుమారు 15 ఎకరాల మామిడి తోట ఉంది. గతేడాది రూ.8 లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది రూ.3 లక్షలు ఖర్చు పెట్టారు. పంట చేతికొచ్చింది. పక్వానికి వచ్చిన కాయలు మాగి రాలుతున్నాయి. ఏదో ఒక ధరకైనా కాయలను కోసి అమ్మేద్దామంటే అడిగేవారు లేరు. పెట్టుబడి ఖర్చులైనా వస్తాయనే



నమ్మకం పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కమ్మిన దైన్యం**

పులిచెర్ల మండలం మంగళంపేటకు చెందిన షేక్ ఇస్మాయిల్‌కు 5 ఎకరాల మామిడి తోటతోనే జీవనం. నీటి కొరత రావడంతో రూ.3 లక్షలు అప్పుచేసి బోరు తవ్వాడు. విద్యుత్ సర్వీసుకు రూ.60 వేలు ఖర్చు పెట్టాడు. కనీసం 15 టన్నుల దిగుబడి వస్తుందని, కష్టాలు గట్టెక్కవచ్చని ఆశపడ్డాడు. ధరలు పడిపోవడంతో అప్పులెలా తీర్చాలో తెలియక సతమతమౌతున్నాడు.

**పదేళ్ల సంపాదన ఆవిరి**

దామలచెరువుకు చెందిన కోవూరు చిన్నబ్బసాహెబ్ పదేళ్లుగా చిన్న చిన్న తోటల్లో పంట కొంటూ వ్యాపారం చేస్తున్నారు. ఈ సారి రూ.15 లక్షలు పెట్టి పాతిక మంది రైతుల తోటలను లీజుకు తీసుకున్నారు. ఇప్పటి వరకు రూ.3 లక్షల రాబడి వచ్చింది. ఇంకా తోటల్లో మిగిలిన పంటను పూర్తిగా కోసి అమ్ముకున్నా మరో రూ.2 లక్షలకు మించి వచ్చేలా లేదు. ఈ మొత్తం కోత కూలీలు, రవాణా ఖర్చులకు సరిపోతోంది. రైతుల వద్దకు వెళ్లి తగ్గించుకోమని ప్రాధేయపడినా స్పందన కరవైంది. పదేళ్ల సంపాదన పూర్తిగా పోయిందని కుంగిపోతున్నాడు.

# కన్నీటి గాయం.. ఆపదలో సాయం

కర్నూలు : రహదారి ప్రమాదాల్లో గాయపడిన, ప్రాణాలు కోల్పోయిన బాధితులకు కేంద్రం చేయూతనిస్తోంది. ఆయా కుటుంబాలకు అండగా ఉండేందుకు సాయమందిస్తోంది. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన సందర్భంలో సదరు వాహనాన్ని పోలీసులు గుర్తించే వరకు ప్రమాద బీమా వర్తించదు. ఇలాంటి ఘటనల్లో క్షతగాత్రులు లేదా చనిపోయినవారి కుటుంబాలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. హిట్ అండ్ రన్ పథకం కింద ఆర్థిక సాయం అందిస్తూ కొండంత అండగా నిలుస్తోంది. ఈ పథకం కింద మృతి చెందిన వారికి సంబంధించి బాధిత కుటుంబ సభ్యులకు రూ. 2 లక్షలు, గాయపడినవారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందుతుంది. కానీ చాలామంది బాధితులకు దీనిపై అవగాహన లేదు. ఫలితంగా పథకాన్ని సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి.

**అక్కడే ఆలస్యం**

హిట్ అండ్ రన్ పథకానికి సంబంధించి ఆర్డీవో నోడల్ అధికారిగా ఉంటారు. ప్రమాదానికి సంబంధించి బాధితులు ఎఫ్ఐఆర్‌తో పాటు ఆధార్ పత్రాలు, సమగ్ర సమాచారాన్ని నివేదిక రూపంలో అందించాలి.



ఆర్డీవో దీనిని పరిశీలించి కలెక్టర్‌కు సిఫారసు చేస్తారు. పోలీసు శాఖ నుంచి నివేదిక అందిన తర్వాత 15 రోజుల్లో పరిహారాన్ని బాధితుల ఖాతాలో జమ చేస్తారు. కాగా పోలీసులు, ఆర్డీవో ఇచ్చే నివేదికలపైనే పరిహారం ఆధారపడి ఉంటుంది.

**జిల్లా న్యాయసేవాధికార సంస్థ చొరవ**

హిట్ అండ్ రన్ కేసులపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రత్యేక దృష్టి సారించి నిత్యం సమీక్షిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ 30న నగరంలోని న్యాయసేవాసదన్‌లో రెవెన్యూ, పోలీసు అధికారులతో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి పలు కేసులపై చర్చించారు. కర్నూలు జిల్లాలో 76, నంద్యాల జిల్లాలో 38 హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి నివేదికలు సిద్ధమవుతున్నట్లు తెలుసుకున్నారు. బాధితులకు త్వరితగతిన పరిహారం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

**దరఖాస్తు ఇలా..** రహదారి ప్రమాదాల్లో గాయపడినవారు, మృతి చెందిన వారికి సంబం ధించి బాధితుల కుటుంబసభ్యులు హిట్ అండ్ రన్ కింద పరిహారం పొందేందుకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. క్షతగాత్రులు ఫారం-1లో వ్యక్తిగత వివరాలతోపాటు ప్రమాద స్థలం, జరిగిన సమయం, గాయాల వివరాలు, ఎఫ్ఐఆర్ కాపీ, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు జత చేయాల్సి ఉంటుంది. మృతి చెందితే వారి తల్లిదండ్రులు గానీ.. భార్య ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, చనిపోయిన వ్యక్తి మరణ ధ్రువీకరణ పత్రాన్ని జత చేసి అందించాలి. ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది పరిహారం పొందాలనుకుంటే ఫారం-4 దరఖాస్తు పూరించి ఆసుపత్రి బిల్లులు జత చేయాల్సి ఉంటుంది. అధికారులు దరఖాస్తును పరిశీలించి ఫారం-2, ఫారం-3 నమోదు చేసి కలెక్టరేట్ లోని సి.సెక్షన్‌కు పంపుతారు. అక్కడినుంచి కలెక్టర్‌కు దరఖాస్తు చేరుతుంది.

# పాక్ గొంతు ఎండుతోంది... షాకింగ్ గా ఐఆర్ఎస్ఏ లెక్కలు!

పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఆపరేషన్ సిందూర్ సైనిక చర్యకంటే ముందు భారత్ పలు దౌత్యపరమైన సంచలన నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... భారత్ - పాక్ మధ్య అత్యంత కీలకమైన సింధూ నదీ జలాల ఒప్పందాన్ని రద్దు చేసింది. ఈ క్రమంలో తాజాగా పెరుగుతోన్న వేడి నేపథ్యంలో పాక్ గొంతు ఎండుతోందని అంటున్నారు. అవును... సింధు, జీలం, చీనాబ్ లతో కూడిన సింధు నదీ వ్యవస్థలో నీటి కొరత తీవ్రంగా ఉన్నందున పాకిస్థాన్ లోని పంజాబ్ ప్రావిన్స్ కఠినమైన ఖరీఫ్ సీజన్ ఎదుర్కొంటోందని అంటున్నారు! ఇప్పటికే ఇస్లామాబాద్ తన రెండు ముఖ్య ప్రాంతాలైన సింధు నదిపై తర్బేలా, జీలం నదిపై మంగ్లాలో నీరు తగ్గిపోతోందని అంటున్నారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారతదేశం సరఫరాలో స్వల్ప తగ్గుదల తర్వాత చీనాబ్ నది ఇన్ ఫ్లో లో ఆకస్మిక తగ్గుదల కలిగిందని చెబుతున్నారు. తాజాగా పాకిస్థాన్



ప్రభుత్వం విడుదల చేసిన డేటా ప్రకారం.. పాకిస్థాన్ పంజాబ్ ప్రావిన్స్ లోపల సింధూ నదీ వ్యవస్థలో నీటి లభ్యత 2025 జూన్ 2 నాటికి.. 2024తో పోలిస్తే 10.3 శాతం తగ్గింది. పైగా ఇంకా నైరుతి రుతుపవనాల ప్రారంభానికి ఇంకా కనీసం నాలుగు వారాల సమయం ఉన్నందున రాబోయే రోజుల్లో ఈ పరిస్థితి మరింత దిగజారొచ్చని చెబుతున్నారు. ఇదే సమయంలో.. పాక్ లోపల సింధు నదీ వ్యవస్థలో నీటి పంపిణీని నిర్వహించడానికి నియంత్రణ సంస్థగా ఉన్న ఇస్లామాబాద్ లోని ఇండస్ రివర్ సిస్టమ్ అథారిటీ (ఐఆర్ఎస్ఏ) స్పందించింది. దాని లెక్కల ప్రకారం.. పంజాబ్ ప్రావిన్స్ లో 2024 జూన్ నాటికి నీటి లభ్యత 1,43,600 క్యూసెక్కులు కాగా.. ఈ ఏడాది జూన్ 2 నాటికి దక్కిన మొత్తం నీటి లభ్యత 1,28,800 క్యూసెక్కులు మాత్రమే. అంటే.. గత ఏడాది ఇదే నెలలో అందుబాటులో ఉన్న నీటికంటే ఇది 14,800 క్యూసెక్కులు తక్కువన్నమాట.

ఈ నేపథ్యంలో ఖరీఫ్ లో విత్తనాలు వేసే సీజన్ ప్రారంభమైనందున, జూన్ చివరి వరకూ నైరుతి రుతుపవనాలు పంజాబ్ ప్రావిన్స్ కు చేరుకునే అవకాశం లేనందున.. తీవ్రమైన వేడి వాతావరణం మధ్య నీటిపారుదల సమస్యలు తీవ్రంగా తలెత్తుతున్నాయని అంటున్నారు. దీంతో.. పాక్ రైతు గొంతు ఎండుతుందని అంటున్నారు.

# ఎస్-400: రష్యాలో వైఫల్యం.. భారత్ లో విజయం ఎందుకంటే..?



రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్లతో విరుచుకుపడిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... రష్యాలోని వైమానిక స్థావరాలే లక్ష్యంగా ఉక్రెయిన్ తన డ్రోన్ లతో పెద్ద ఎత్తున దాడులకు తెగబడింది. ఈ క్రమంలో.. దాదాపు 41 యుద్ధ విమానాలు ధ్వంసమయ్యాయి. ఈ సమయంలో.. రష్యా భూభాగంలోకి చొచ్చుకెళ్లి నిర్వహించారంటూ డ్రోన్ దాడిని జెలెన్ స్కీ కొనియాడారు. ఈ సమయంలో ఎస్-400 క్షిపణిపై చర్చ తెరపైకి వచ్చింది. అవును... రష్యా ఎస్-400 క్షిపణి వ్యవస్థ ప్రపంచంలోనే అత్యంత అధునతన గగనతల రక్షణ వ్యవస్థలలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. ప్రధానంగా ఆపరేషన్ సిందూర్ అనంతరం ఈ క్షిపణి వ్యవస్థ గురించిన చర్చ మరింత ఎక్కువగా జరిగింది. ఈ వ్యవస్థ.. విమానం, క్షిపణులు, డ్రోన్లు వంటి వైమానిక దాడులను అడ్డుకోగలదు. ఆపరేషన్ సిందూర్ లో పాకిస్థాన్ డ్రోన్ లు, క్షిపణులను దీని సాయంతో భారత్ సక్సెస్ ఫుల్ గా తిప్పికొట్టింది. అయితే... తాజాగా ఉక్రెయిన్ డ్రోన్లు ఆ స్థాయిలో తమపై విరుచుకుపడుతుంటే రష్యా ఎందుకు వాటిని ఆపలేకపోయింది? అనేది పెద్ద ప్రశ్నగా ఉంది. ఈ సమయంలో రష్యాలోని ఎస్-400 వైఫల్యానికి పలు కారణాలున్నాయని అంటున్నారు నిపుణులు. ఇందులో భాగంగా... రష్యా రెగ్యులర్ గా స్వల్ప శ్రేణి వైమానిక రక్షణ వ్యవస్థల సపోర్ట్ లేకుండా ఎస్-400 ను ఒంటరిగా మోహరించిందని.. దీనివల్ల డ్రోన్లు వంటి తక్కువ ఎత్తులో ఎగురుతున్న లక్ష్యాలను అడ్డగించడం కష్టమైందని చెబుతున్నారు. ఇదే సమయంలో.. ఎస్-400ను నాశనం చేయడానికి ఉక్రెయిన్ సంక్లిష్టమైన వ్యూహాన్ని అనుసరించిందని.. ఇందులో భాగంగా వారు మొదట డ్రోన్ యొక్క రాడార్, యాంటెన్నాను లక్ష్యంగా చేసుకుంటారని.. అనంతరం, క్షిపణులతో దాడి చేస్తారని చెబుతున్నారు.

ఈ విధానంవల్ల రష్యా రక్షణ వ్యవస్థలను చొచ్చుకునిపోవడంలో సక్సెస్ అయ్యిందని చెబుతున్నారు. ఇదే సమయంలో ఎలక్ట్రానిక్ వార్ ఫేర్ పద్ధతులను ఉపయోగించి ఎస్-400 రాడార్ సిగ్నల్స్ ను ఉక్రెయిన్ జామ్ చేసిందని అంటున్నారు. దీనివల్ల రక్షణ వ్యవస్థ ఈ లక్ష్యాలను ట్రాక్ చేయలేకపోయిందని చెబుతున్నారు. అదేవిధంగా.. భారత్ చేసినట్లుగా రష్యా ఎస్-400 ను రక్షించడానికి తరచూ తరలించడం లేదా నకిలీ వ్యవస్థలను ముందు పెట్టడం వంటి చర్యలు తీసుకోలేదని.. ఈ నిర్లక్ష్యాన్ని ఉక్రెయిన్ సద్వినియోగం చేసుకుందని అంటున్నారు. ఈ సందర్భంగా స్పందించిన నిపుణులు... ఎస్-400 ఇప్పటికీ శక్తివంతమైన వ్యవస్థ అని.. విమానాలు, క్రూయిజ్ క్షిపణులు, బాలిస్టిక్ క్షిపణులను అడ్డగించగలదని చెబుతున్నారు. అయితే.. దీన్ని సమర్థవంతంగా చేయడానికి సరైన మద్దతు వ్యవస్థలతో పాటు వ్యూహం అవసరమని అంటున్నారు. ఈ విషయంలో రష్యా బలహీనతలు ఉక్రెయిన్ సద్వినియోగం చేసుకోగా.. భారత్ మాత్రం ఎస్-400 ని పక్కా వ్యూహాలతో ఉపయోగించుకుందని చెబుతున్నారు.

# కొలెస్ట్రాల్, బీపీ, షుగర్ కంట్రోల్.. జపాన్ 'వాకింగ్' పద్ధతితో అదిరే ఫలితాలు!

నడవడం అంటే మనం రోజూ చేసేదే కదా? మన ఫోన్లలో ఉండే హెల్త్ యాప్స్ కూడా రోజుకు 10 వేల అడుగులు నడవండి అని చెబుతుంటాయి. కానీ, జపాన్ శాస్త్రవేత్తలు ఈ మామూలు నడకను ఒక కొత్త పద్ధతిగా మార్చారు. ఇప్పుడు ఈ పద్ధతి ప్రస్తుతం ప్రపంచమంతా ఫేమస్ అవుతోంది. దీని పేరు ఇంటర్వెల్ వాకింగ్ ట్రైనింగ్. దీని వల్ల చాలా మంచి లాభాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. బరువు తగ్గడానికి గంటల తరబడి ట్రెడ్‌మిల్‌పై పరుగెత్తాల్సిన పనిలేదు. ఈ IWT పద్ధతిలో మనం కొద్దిసేపు వేగంగా, కొద్దిసేపు నెమ్మదిగా నడవాలి. జపాన్‌కు చెందిన డాక్టర్ హిరోషి నోస్ అనే శాస్త్రవేత్త దీన్ని కనిపెట్టారు. ఈ పద్ధతిలో మూడు నిమిషాలు వేగంగా నడవాలి (మీరు మాట్లాడలేనంత వేగంగా). ఆ తర్వాత మూడు



నిమిషాలు నెమ్మదిగా నడవాలి (మామూలుగా మాట్లాడగలిగేంత వేగంగా). ఇలా 30 నిమిషాల పాటు మొత్తం ఐదు సార్లు చేయాలి. దీని వల్ల మీ గుండె బలంగా మారుతుంది.

కాళ్లు గట్టిపడతాయి. ఇంకా మీరు చిన్నవాళ్లు అయినట్లు కూడా అనిపిస్తుందని చెబుతున్నారు. మామూలుగా గంటల తరబడి నెమ్మదిగా నడిచేదాని కంటే, ఈ IWT పద్ధతి మన శరీరాన్ని చాలా చురుకుగా ఉంచుతుంది. మీ శరీరం కొవ్వును బాగా కరిగించుకుంటుంది. ఇంకా గుండె ఆరోగ్యం కూడా బాగా మెరుగుపడుతుంది.

**జపాన్‌లో పరిశోధనలు ఏం చెబుతున్నాయి?....** జపాన్‌లో శాస్త్రవేత్తలు ఈ నడక పద్ధతిపై కొన్ని పరిశోధనలు చేశారు. ఈ పద్ధతిని వారానికి నాలుగు సార్లు, మూడు నెలల పాటు పాటించిన వారిలో చాలా మంచి మార్పులు కనిపించాయి. కొలెస్ట్రాల్, బీపీ (రక్తపోటు), షుగర్ (రక్తంలో చక్కెర) స్థాయిలు తగ్గాయి. కండరాలు బలంగా మారాయి. బరువు తగ్గారు. నిరాశ (డిప్రెషన్) కూడా తగ్గింది. ఈ వాకింగ్ పద్ధతిని మీరు ఇంట్లో, తోటలో, టెర్రస్‌పై, లేదా పార్కులో ఎక్కడైనా చేయొచ్చు. పెద్దవాళ్లు, చిన్నవాళ్లు, ఇంకా వ్యాయామం కొత్తగా మొదలుపెట్టేవాళ్లు కూడా దీన్ని సులభంగా చేయవచ్చు.

**కేవలం నడకతోనే ఆరోగ్యం...** ఖరీదైన జిమ్‌లకు వెళ్లాల్సిన పనిలేదు, ప్రత్యేక పరికరాలు అవసరం లేదు. మీకు కావాల్సిందల్లా కేవలం 30 నిమిషాలు, ఒక మంచి జత బూట్లు, ఇంకా ఆరోగ్యంగా ఉండాలనే కోరిక ఉంటే చాలు. కాబట్టి, మీరు తదుపరిసారి వ్యాయామం చేయకూడదని అనుకుంటే.. ఈ 'జపనీస్ వాకింగ్' పద్ధతిని పాటించవచ్చు. ఇది మిమ్మల్ని ఎక్కువ కాలం ఆరోగ్యంగా, బలంగా, ఇంకా చురుగ్గా ఉంచుతుంది.

## సినిమా 'షో'

# టాలీవుడ్ లో టాపే కానీ అక్కడ మాత్రం..?

కన్నడ భామ రష్మిక మందన్న ప్రస్తుతం పాన్ ఇండియా లెవెల్ లో అదరగొట్టేస్తుంది. తెరకు పరిచమైంది కన్నడ పరిశ్రమ నుంచే అయినా రష్మికకు ఈ స్టార్ ఇమేజ్ వచ్చేలా చేసింది మాత్రం తెలుగు పరిశ్రమే అని తెలిసిందే. ఛలో సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన రష్మిక ఆ సినిమా నుంచి ఒక్కో మెట్టు ఎక్కుతూ స్టార్ ఛాన్స్ లు అందుకుంది. తెలుగులో టాప్ రేంజ్ కి వెళ్లిన అమ్మడు అదే క్రేజ్ తో బాలీవుడ్ ఆఫర్లను అందుకుంది. రష్మిక బాలీవుడ్ ఎంట్రీ మొదటి రెండు సినిమాలు సోసోగానే ఆడిన ఆ తర్వాత మాత్రం హిట్లు సూపర్ హిట్లతో స్టార్ తిరిగింది. బాలీవుడ్ సినిమాలు సైతం ఇప్పుడు రష్మికని హీరోయిన్ గా తీసుకోవాలని పోటీ పడుతున్నారు. బాలీవుడ్, టాలీవుడ్ లో రష్మిక టాప్ లీగ్ లో కొనసాగుతుంది. ఐతే తమిళంలో మాత్రం రష్మిక ఆశించిన క్రేజ్ తెచ్చుకోలేదు. అక్కడ ఆల్రెడీ స్టార్ హీరోయిన్స్ ఉన్నారు. అయినా కూడా రష్మిక విజయ్, కార్తి లాంటి వళ్లతో



నటించింది. అయినా కూడా అక్కడ రష్మికకి అంత ఫ్యాన్ బేస్ ఏర్పడలేదు. నేషనల్ క్రష్ అంటూ ఇటు టాలీవుడ్, అటు బాలీవుడ్ సైతం రష్మిక వెంట పడుతుంటే తమిళ పరిశ్రమలో ఆమెను పెద్దగా పట్టించుకోలేదు. ఐతే కోలీవుడ్ మీద దృష్టి పెట్టే టైం లో బాలీవుడ్ నుంచి వరుస ఆఫర్లు రావడంతో తన ఫోకస్ అటు షిఫ్ట్ చేసింది రష్మిక. బీ టౌన్ ఆడియన్స్ కి రష్మిక తెగ నచ్చేసింది.

నటన, గ్లామర్ ఇలా దేనికదే ఎంత కావాలంటే అంత ఇచ్చేస్తూ వస్తున్న రష్మిక టాప్ రేంజ్ కి వెళ్లడంలో తన సత్తా చాటుతుంది. ప్రస్తుతం అమ్మడు తెలుగులో కుబేర, ది గర్ల్ ఫ్రెండ్ సినిమాలు చేస్తుంది. ఈ సినిమాలతో పాటు హిందీలో మరో రెండు సినిమాల డిస్కషన్స్ ఉన్నాయట. త్వరలో వాటి అనౌన్స్ మెంట్ వస్తుందని తెలుస్తుంది. రష్మిక నెక్స్ట్ విజయ్ దేవరకొండ సినిమాలో కూడా టాక్ నడుస్తుంది. ఈ ఇద్దరు జోడీ కడితే మాత్రం ఆ లెక్క వేరేలా ఉంటుందని ఆడియన్స్ ఫిక్స్ అయ్యారు. ఆ సినిమా విశేషాలు ఏంటన్నది త్వరలో బయటకు రానున్నాయి. రష్మిక చేస్తున్న సినిమాలు ప్లానింగ్ లో ఉన్న ప్రాజెక్ట్ లు ఇవన్నీ కూడా మళ్లీ ఆమెను బాక్సాఫీస్ క్వీన్ గా మార్చే ఛాన్స్ ఉన్నట్టుగానే అనిపిస్తుంది.

# జాన్వీ కొత్త మూవీ.. సౌత్ వాళ్ళకి నచ్చలేదా?



బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్.. వరుస సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. అందం, అభినయంతో ఆకట్టుకుంటూ భాషతో సంబంధం లేకుండా మంచి అవకాశాలు అందుకుంటున్నారు. ఇప్పుడు బీ టౌన్ స్టార్ హీరోతో కలిసి సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ పరమ్ సుందరి మూవీ చేస్తున్నారు. దాస్వి ఫేమ్ తుషార్ జలోటా దర్శకత్వం వహిస్తుండగా.. మడాక్ ఫిల్మ్స్ పై దినేశ్ విజన్ నిర్మిస్తున్నారు. రాజీవ్ ఖండేల్వాల్, ఆకాష్ దహియా కీలక పాత్రలు పోషిస్తున్నారు. నార్త్ ఇండియాకు చెందిన పరమ్ (సిద్ధార్థ్), సౌత్ ఇండియాకు చెందిన సుందరి (జాన్వీ) మధ్య ప్రేమకథగా సాగనున్న మూవీ జులై 25వ తేదీన రిలీజ్ కానుంది. అయితే మూవీ ప్రమోషన్స్ లో భాగంగా మేకర్స్.. రీసెంట్ గా ఫస్ట్ లుక్ టీజర్ ను రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. హీరో హీరోయిన్లను పరిచయం చేస్తూ స్టార్ట్ అవ్వగా.. ఇద్దరి మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకుంటుంది. టీజర్ చివర్లో జాన్వీ కత్తితో కనిపించి షాక్ ఇచ్చింది. బ్యాక్ గ్రౌండ్ లో సోను నిగమ్ ఆలపించిన సాంగ్ హైలైట్ గా నిలిచింది. కేరళలోని అందమైన బ్యాక్ వాటర్స్, హౌస్ బోట్ ల నేపథ్యం మాత్రం అద్భుతంగా ఉందని చెప్పాలి. ఓవరాల్ గా గ్లింప్స్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. డీసెంట్ గా బాగుందని అనేక మంది నెటిజన్లు కొనియాడారు. కానీ ఇప్పుడు ఫస్ట్ లుక్ టీజర్ రిలీజ్ అయ్యాక కొందరు సౌత్ మూవీ లవర్స్ మాత్రం సోషల్ మీడియాలో నిరాశ వ్యక్తం చేస్తున్నారు. సినిమాలో జాన్వీ కపూర్ రోల్ డిజైన్ చేసిన తీరును విమర్శిస్తున్నారు. ఎప్పుడూ సౌత్ అమ్మాయిలను ఒకేలా చూపిస్తున్నారని అంటున్నారు. మీనాక్షి సుందరేశ్వర్, చెన్నై ఎక్స్ ప్రెస్ వంటి చిత్రాల్లో కూడా దక్షిణ భారత మహిళలను ఒకే విధంగా చిత్రీకరించారని, దీపికా పదుకొనే సాన్య మల్హోత్రా రోల్స్ ఒకే విధంగా ఉంటాయని చెబుతున్నారు.

సంస్కృతి గురించి కాదని, ప్రాతినిధ్యంలో వైవిధ్యం లేకపోవడం గురించి తమ బాధ అని చెబుతున్నారు. దక్షిణ భారత సంస్కృతి గొప్పది, వైవిధ్యమైనదని, అయినప్పటికీ సేమ్ క్యారెక్టరైజేషన్ ను మళ్లీ మళ్లీ ఉపయోగిస్తున్నారని అంటున్నారు. మరోవైపు, కేవలం ఒక చిన్న టీజర్ తో కామెంట్ చేయొద్దని, మూవీ వచ్చాక చూడాలని చెబుతున్నారు. మొత్తానికి పరమ్ సుందరి మూవీ హాట్ టాపిక్ గా మారింది.

# కమల్ తో లిప్ లాక్ సీన్.. అభిరామి ఇష్టంతోనే చేసిందట!

దిగ్గజ నటుడు కమల్ హాసన్, ప్రముఖ దర్శకుడు మణిరత్నం కాంబినేషన్ లో థగ్ లైఫ్ మూవీ రూపొందిన విషయం తెలిసిందే. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన ట్రైలర్ ను మంచి రెస్పాన్స్ వచ్చింది. కానీ కమల్, నటి అభిరామి మధ్య లిప్ లాక్ సీన్ హాట్ టాపిక్ గా మారింది. ఒక్కొక్కరు ఒక్కోలా రెస్పాండ్ అయ్యారు. కొందరు సినిమాను సినిమా లాగా చూడాలని కామెంట్ చేయగా.. మరికొందరు 70 ఏళ్ల కమల్ హాసన్.. తనకంటే వయసులో ఎంతో చిన్న అయిన అభిరామితో ఘాటు లిప్ లాక్ సీన్ చేయడంపై విమర్శించారు. దీనిపై ఇప్పుడు అభిరామి రెస్పాండ్ అయ్యారు. ఆ సీన్ 3 సెకన్లను అని, అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని తెలిపారు. "నేను దర్శకుడు మణిరత్నం గారు ఆ రోల్ లో నన్ను ఎందుకు తీసుకున్నారని అడిగాను. నా చిత్రనిర్మాతల నిర్ణయాలను నేను ఎల్లప్పుడూ గౌరవిస్తాను. నేను ఆ సన్నివేశాన్ని ఇష్టపూర్వకంగా చేశాను. ఇది కేవలం మూడు షాట్లలోనే కనిపిస్తుంది.



ఆ చిన్న క్లిప్ కారణంగా చాలా అపార్థాలు వచ్చాయి" అని అభిరామి తెలిపారు. "కిస్ సీన్ వెనుక మణి సర్ లాజిక్ ను నేను జడ్జ్ చేయడం లేదు. ఆయన లాజిక్ తో నేను ఏకీభవిస్తాను. పూర్తి సినిమా చూసిన తర్వాత అభిప్రాయాలు మారుతాయని నేను నమ్ముతున్నాను. విడుదల తర్వాత ఈ అంశం కొనసాగుతుందని నేను అనుకోను.

దాని గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు" అని చెప్పారు.. అందుకే కామెంట్ చేసే ముందు అందరూ సినిమా చూడాలని తాను కోరుతున్నట్లు తెలిపారు అభిరామి. అనవసరంగా దీనిపై రాద్ధాంతం చేస్తున్నారని, అసలెందుకు అలా చేస్తున్నారో నిజంగా తనకు తెలియడం లేదని అభిప్రాయపడ్డారు. ఏ మూవీకి అయినా కలిసొచ్చేదే మార్కెటింగ్ టీమ్ చేస్తుందని తెలుసని చెప్పారు. అయితే కమల్ సార్ ఎప్పుడు ఎలాంటి సీన్లు చేసినా వాటిపై ఎవరో ఒకరు ఏదో ఒకటి అంటూనే ఉంటారని అభిరామి అన్నారు. అలా అని మిగతా వాళ్లు ఇలాంటి సీన్లు చేయరని కాదు, కానీ ఓ టాప్ యాక్టర్ చేస్తే దాని గురించి మాట్లాడుకుంటారని చెప్పారు. ఇది ప్రస్తుత రోజుల్లో కామన్ అయినా.. కొద్ది రోజుల తర్వాత ప్రేక్షకులు కూడా అప్ గ్రేడ్ అవుతారని ఆశిస్తున్నట్లు తెలిపారు.

Printed,Published and owned by CHALLA MADHUSUDHANA RAO,and Printed at VEERENDRA GRAPHICSD.NO.8-25-33, NTR Nagar, 2nd Line, Guntur - 522001. Guntur Dist, A.P.
and Published at D.No.8-25-33, NTR Nagar, 2nd Line, Guntur - 522001, Guntur Dist, A.P. **R.N.I. No. APTEL/2013/48712** Editor : CHALLA MADHUSUDHANA RAO